www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా...

బుధవారం 30 - 7 - 2025 | సంపుటి : 1 | సంచిక : 25 | పేజీలు : 12 | వెల : 5/- | తెలంగాణ/ఆంధ్రప్రదేశ్




# భారత్ యుద్ధ దేశం కాదు..

# బుద్ధ దేశం..




ఆయుధాలమయమైన ప్రపంచంలో విశ్వశాంతి ముఖ్యం

ఎంత పటిష్ఠంగా ఉన్నా.. శాంతి కోసమే ప్రయత్నిస్తాం

పీవోకేను ఎందుకు వెనక్కి తీసుకురాలేదని కాంగ్రెస్ అడుగుతోంది

పహల్గాంలో దాడికి పాల్పడిన

ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాం

ఉగ్రవాదుల్ని హతమార్చేందుకు తేదీలు, వారాలు చూడాలా?

సైన్యంపై నమ్మకం ఉన్నచోటే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుంది

దేశం సురక్షితంగా ఉన్నప్పుడే విజ్ఞానపరంగా అభివృద్ధి చెందుతాం

కాంగ్రెస్ ఎప్పుడూ నిరాశాభావంలోనే ఉంటోంది

భారత రక్షణ పరిశ్రమల్లో సంస్కరణలు తీసుకొచ్చాం

ప్రైవేటు పరిశ్రమలకు తలుపులు తెరిచాం

భారత రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 30 రెట్లు పెరిగాయి

ఆత్మనిర్భర్ ఉత్పత్తులతో భారత యువత సత్తా చాటుతోంది

ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో మాట్లాడిన ప్రధాని మోడీ

2లో...



## బనకచర్ల ప్రాజెక్టును నిలువరించాల్సిందే

**రాష్ట్ర సాగునీటి రంగాన్ని ఆగం చేస్తుంది**
**రైతు సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి**
**బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్**

విశ్వంభర, హైదరాబాద్: రైతు సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆ పార్టీ నేతలకు సూచించారు. మంగళవారం కొంతమంది నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు సమస్యలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు."బీఆర్ఎస్ శ్రేణులను క్షేత్రస్థాయి పోరాటాల్లో కార్యోన్ముఖుల్ని చేయాలి. సాగు సంక్షోభాన్ని నివారించేందుకు పోరాటాలను ఉద్ధృతం చేయాలి. బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్ర సాగునీటి రంగాన్ని ఆగం చేస్తుంది. ఎట్టి పరిస్థితిల్లోనైనా ఆ ప్రాజెక్టును నిలువరించాల్సిందే" అని కేసీఆర్ అన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తిపైనే అభ్యంతరకర వ్యాఖ్యలా..?



ఒక న్యాయవాదిగా వ్యాఖ్యలు చేస్తూ పిటిషన్ ఎలా దాఖలు చేస్తారు

ఆగ్రహం వ్యక్తం చేసిన సీజేఐ జస్టిస్ గవాయ్

పిటిషనర్ , న్యాయవాదిపై కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ

తదుపరి విచారణకు పిటిషనర్ వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలు

2లో...

## ఉద్యోగాల పేరుతో రూ.140 కోట్లు వసూలు..

తెలుగు రాష్ట్రాల్లోని బాధితులు

పోలీసులకు ఫిర్యాదు

ముద్ర కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ అరెస్టు



## అది ముస్లిం రిజర్వేషన్ల బిల్లు

బీసీ రిజర్వేషన్ల పేరిట మతపరమైన కోటా కల్పించడం అన్యాయం

42% రిజర్వేషన్ల అమలు చేసే పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

2లో...

## కాలుష్యరహిత హైదరాబాదే లక్ష్యం

### పాతికేళ్ల అవసరాలకు తగినట్లు ప్రణాళికలు



2లో...

మెట్రో పనులు వేగవంతం చేయాలి - నగరానికి ఐకానిక్ గా మూసీ అభివృద్ధి ఉండాలి - కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలి

నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కేబుల్ వ్యవస్థపై దృష్టి పెట్టాలి

నిర్మాణ రంగ వ్యర్థాలనుఎక్కడపడితే అక్కడ డంప్ చేయకుండా చర్యలు తీసుకోవాలి

నగరంలోని మంచినీరు, మురుగు నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలి

ఎంఏయూడీ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి..

## ట్రంప్ అబద్ధాల కోరు అని ప్రకటించాలి



సీజ్ ఫైర్‌కు తానే కారణం అని ట్రంప్ 29సార్లు చెప్పారు ..

ఇందిరాగాంధీలో సగం ధైర్యం ఉన్నా ఆ విషయం మోడీ సభలో చెప్పాలి

ఆపరేషన్ సిందూర్ విషయంలో మన సైనికుల చేతులు కట్టివేశారు

పహెల్గాం ఉగ్రదాడిని అందరూ ఖండించారు

కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించింది

లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ

2లో...




2లో...

## మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు..

రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ పనిచేస్తుంది

అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి

34,865 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి

వీటిలో తెలంగాణకు సంబంధించి 780 కేసులు

మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్

## వైశ్య జాతి సిందూరం కాచం

### వైశ్య రాజకీయ రణభేరి పాటల సీడీ, పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్:** వైశ్య జాతి సిందూరం కాచం అని ఆర్యవైశ్య చైతన్యపోరాట సమితి అధ్యక్షులు ప్రేమ్ గాంధీ, మొగుళ్లపల్లి ఉపేందర్, తడకమళ్ల విజయ్‌కుమార్, బచ్చు శ్రీనివాస్‌లు అన్నారు. కర్మన్‌ఘట్‌లోని లక్ష్మీ కన్వెన్షన్‌లో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో ఆగస్టు 3న జరగనున్న వైశ్యరాజకీయ రణభేరి పాటల సీడీ ఆవిష్కరణ, రణభేరి పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈకార్యక్రమంలో వైశ్యవికాస వేదిక ఛైర్మన్ డా.కాచం సత్యనారాయణ గుప్త, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాచం సుష్మ, వైశ్య నాయకులు నాళ్ల శ్రీనివాస్, మాజేటి మురళి, కూర రమేష్, బచ్చు శ్రీనివాస్, తడకమళ్ల విజయ్, కొత్తా రవి, కొదుమూరి దయాకర్, బుక్కా ఈశ్వరయ్య, , కవిత, మొరిశెట్టి సంతోష్, తేరేటిపల్లి శ్రీనివాస్, శ్రీరామచంద్ర మూర్తి, సురేష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



## బీసీ బిల్లు కోసం 72 గంటల నిరాహారదీక్ష



- ఆగస్టు 4 నుంచి 7వరకు ఇందిరా పార్క్‌లో దీక్షచేస్తా
- ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో..
- బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం అంతే ముఖ్యం
- గవర్నర్ ఆర్డినెన్స్ ఆమోదించకుంటే ఎందుకు న్యాయపోరాటం చేయడం లేదు - బీహార్ ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ ఢిల్లీలో దీక్ష చేస్తామంటోంది
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

2లో...

# భారత్ యుద్ధ దేశం కాదు.. బుద్ధ దేశం..

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఆపరేషన్ మహాదేవ్ ద్వారా పహల్గాంలో దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చినట్లు ప్రధాని నరేంద్ర మోడీవెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో వాడీవేడిగా కొనసాగిన చర్చ అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఆపరేషన్ మహాదేవ్ నిన్న ఎందుకు చేపట్టారని విపక్షాల నేతలు ఆరోపిస్తున్నారు. ఎప్పుడు పట్టుకున్నారు.. నిన్ననే ఎందుకు కాల్చారంటూ ప్రశ్నిస్తున్నారు. ఉగ్రవాదుల్ని హతం చేయడానికి తేదీలు, వారాలు చూడాలా?" అని ప్రధాని ప్రశ్నించారు. "సైన్యంపై నమ్మకం ఉన్నచోటే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుంది. దేశం సురక్షితంగా ఉన్నప్పుడే విజ్ఞానపరంగా అభివృద్ధి చెందుతాం. కాంగ్రెస్ ఎప్పుడూ నిరాశాభావంలోనే ఉంటోంది. ఆయుధపరంగా ఎంత పటిష్ఠంగా ఉన్నా.. శాంతి కోసమే ప్రయత్నిస్తాం. పీవోకేను తిరిగి కైవసం చేసుకోవాలని విపక్షాలు అడుగుతున్నాయి. పీవోకేను ఎందుకు వెనక్కి తీసుకురాలేదని కాంగ్రెస్ అడుగుతోంది. ఎవరి కాలంలో పీవోకే.. పాక్ కబ్జాలోకి వెళ్లిందో అందరికీ తెలుసు. దేశభద్రత విషయంలో కాంగ్రెస్ మొదట్నుంచీ ఉదాసీనంగానే వ్యవహరించింది" అని ప్రధాని మోడీ ఆక్షేపించారు.

ఆ సువర్ణావకాశాన్ని కాంగ్రెస్ వృథా చేసింది..

"1971లో పీవోకేను వెనక్కి తీసుకొనే అవకాశం వచ్చినా ఉపయోగించుకోలేదు. అప్పుడు వేలాది మంది పాక్ సైనికులు మనకు బందీలుగా చిక్కారు. 1971లో మన సైన్యం పాక్ భూభాగంలో వేల కిలోమీటర్లు ముందుకెళ్లింది. ముందుచూపుతో వ్యవహరించి ఉంటే పీవోకేను అప్పుడే తిరిగి పొందేవాళ్లం. పీవోకేను తిరిగి పొందే సువర్ణావకాశాన్ని కాంగ్రెస్ వృథా చేసింది. 1974లో కచ్చతీవు దీవులను శ్రీలంకకు అప్పగించారు. కచ్చతీవు దీవులు శ్రీలంకకు వెళ్లిపోవడంతో తమిళ జాలర్లు ఇబ్బందులు పడుతున్నారు" అన్నారు. 'జాతీయ భద్రతా విజన్ కాంగ్రెస్‌కు గతంలో లేదు.. భవిష్యత్తులో వచ్చే ప్రశ్నేలేదు. స్వాతంత్ర్యం తర్వాత తీసుకున్న నిర్ణయాలతో భారత్ ఇప్పటికీ శిక్ష అనుభవిస్తోంది. యూపీఏ హయాంలో ఎన్ని ఉగ్రదాడులు జరిగినా పాక్‌కు ఉన్న మోస్ట్ ఫేవర్డ్ నేషన్ హోదాను తొలగించలేదు. పహల్గాం దాడుల తర్వాత పాక్‌కు ఆ హోదాను తొలగించాం.

ఈ ఘటన తర్వాత సరిహద్దులు మూసివేశాం.. వీసాలు రద్దు చేశాం. నెహ్రూ ఆనాడు చేసుకున్న సింధు జలాల ఒప్పందంతో 'నదులు మనవి.. జలాలు పాక్‌వి' అన్నట్లుగా మారింది. ఆ ఒప్పందం కుదుర్చుకోకపోయి ఉంటే భారత భూభాగం సస్యశ్యామలమయ్యేది" అని తెలిపారు.

**భారత్ యుద్ధ దేశం కాదు.. బుద్ధ దేశం..**




భారత రక్షణ పరిశ్రమల్లో సంస్కరణలు తీసుకొచ్చాం. రక్షణ రంగంలో ప్రైవేటు పరిశ్రమలకు తలుపులు తెరిచాం. గతంతో పోలిస్తే రక్షణ బడ్జెట్ మూడింతలు పెరిగింది. రక్షణ ఉత్పత్తుల్లో 250శాతం వృద్ధి నమోదైంది. భారత రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 30 రెట్లు పెరిగాయి. మన రక్షణ ఉత్పత్తులు 100 దేశాలకు చేరుతున్నాయి. రక్షణ ఉత్పత్తుల మార్కెట్‌లో భారత్ జెండా పాతింది. ఆత్మనిర్భర్ ఉత్పత్తులతో భారత యువత సత్తా చాటుతోంది. ఆయుధాలమయమైన ప్రపంచంలో విశ్వశాంతి ముఖ్యం. భారత్ యుద్ధ దేశం కాదు.. బుద్ధ దేశం" అని మోడీఅన్నారు.

## అది ముస్లిం రిజర్వేషన్ల బిల్లు

**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర, హైదరాబాద్:** బీసీ రిజర్వేషన్ బిల్లుపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. నేడు హైదరాబాద్ లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన... కాంగ్రెస్ తీసుకొచ్చింది బీసీల రిజర్వేషన్ల బిల్లు కాదని, అది కేవలం ముస్లిం రిజర్వేషన్ల బిల్లని ఆరోపించారు. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకం కాదని తెలిపిన రామచందర్ రావు.. కానీ బీసీ రిజర్వేషన్ల పేరిట మతపరమైన కోటా కల్పించడం అన్యాయం అని పేర్కొన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు చేసే పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేని స్పష్టం చేసారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులో న్యాయపరమైన లోపాలను దాచిపెట్టి, కేంద్రాన్ని ప్రజలు నిందించేలా కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కామారెడ్డిలో బీసీలకు డిక్లరేషన్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వాటిని అమలు చేయకుండా తప్పించుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత ఖచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వానిదేని తేల్చి చెప్పారు. అందులో ఒక్క శాతం తగ్గినా బీజేపీ ఊరుకోదని హెచ్చరిస్తూ... బీసీల హక్కులు సాధించే దాకా బీజేపీ పోరాటం ఆగదని రామచందర్ రావు వెల్లడించారు.

## ఉద్యోగాల పేరుతో రూ.140 కోట్లు వసూలు..

### తెలుగు రాష్ట్రాల్లోని బాధితులు పోలీసులకు ఫిర్యాదు
### ముద్ర కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ అరెస్టు



విశ్వంభర, హైదరాబాద్: ముద్ర అగ్రికల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ తిప్పనేని రామదాసప్పను తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. రామదాసప్ప తోపాటు ఆయన కుమారుడు సాయి కిరణ్‌ను మంగళవారం అమరావతిలో అదుపులోకి తీసుకున్నారుసీఐడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్యోగాలు, అధిక వడ్డీల పేరుతో 2వేలకుపైగా బాధితుల నుంచి రామదాసప్ప రూ.140 కోట్లు వసూలు చేశారు. 2వేల మార్కెటింగ్ మేనేజర్ ఉద్యోగాలంటూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. ఉద్యోగాల కోసం తెలుగు రాష్ట్రాల నుంచి బాధితులు వారిని సంప్రదించి పెద్దమొత్తాల్లో నగదు చెల్లించారు. ఆ తర్వాత రైతుల నుంచి పెట్టుబడులు తేవాలని, లేదంటే జీతం నుంచి తీసుకుంటామని రామదాసప్ప ఉద్యోగులను వేధించారు. తీసుకున్న సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. దీంతో అతడిపై తెలుగు రాష్ట్రాల్లోని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన తెలంగాణ సీఐడీ అధికారులు తాజాగా నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# కాలుష్యరహిత హైదరాబాదే లక్ష్యం

### పాతికేళ్ల అవసరాలకు తగినట్లు ప్రణాళికలు – ఎంఏయూడీ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి...**

విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్ నగరాన్ని పర్యావరణహితంగా మార్చాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. విపరీతమైన కాలుష్యంతో ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని... అటువంటి పరిస్థితి హైదరాబాద్ నగరంలో తలెత్తకూడదన్నారు. కోర్ సిటీలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని సీఎం ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు అవసరమైన సంస్కరణలు చేపట్టాలని... ఇందుకు రానున్న 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇందుకుగానూ ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో సమస్యలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో అన్ని శాఖలు సమగ్ర డీపీఆర్‌లు తయారు చేయాలని సీఎం సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని... నిర్మాణ రంగ వ్యర్థాలను సిటీలో ఎక్కడపడితే అక్కడ డంప్ చేయకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో మంచినీటి సరఫరా, మురుగు నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా హైదరాబాద్ నగర మంచినీటి సరఫరా.. సీవరేజీ బోర్డు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. బోర్డు తమకున్న వనరులను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై ప్రత్యేక ప్రణాళిక రూపొంచుకోవాలని సీఎం సూచించారు. ఓఆర్ఆర్ పరిధిలోని వారసత్వ కట్టడాల సంరక్షణ, వాటిని పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకుగానూ కులీకుతుబ్ షాహీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించి దానిని మరింత బలోపేతం చేయాలని సీఎం ఆదేశించారు. మార్గదర్శకాల రూపకల్పనలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాతబస్తీలో మెట్రో పనుల పరిస్థితిపైనా



సీఎం ఆరా తీశారు. అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున అక్కడ అక్కడ మెట్రో పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మెట్రో ఇతర ఫేజ్‌ల అనుమతులు, తదితర విషయాల్లో ఏమాత్రం జాప్యాన్ని సహించబోమని హెచ్చరించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖతో సమన్వయం చేసుకుంటూ త్వరగా పనులు పట్టాలెక్కేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు సంబంధించి హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓఆర్ఆర్ నుంచి మూసీ వైపు వచ్చే క్రమంలో కొత్వాల్‌గూడ జంక్షన్‌లో మూసీ రివర్ ఫ్రంట్‌కు ప్రతీకగా ఇండియా గేట్, గేట్ వే ఆఫ్ ఇండియా, చార్మినార్ లాంటి ఓ ల్యాండ్ మార్క్‌ను నిర్మించాలని సీఎం సూచించారు. మూసీపైన బ్రిడ్జి కం బ్యారేజీలకు ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అనుమతులు, నిబంధనల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని అధికారులకు తెలిపారు. నెహ్రూ జూ పార్క్, మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల్లో పురోగతిపైనా సీఎం సమీక్షించారు. మీరాలం ట్యాంక్ ఎదుట ఏర్పాటు చేసిన ఎస్టీపీలు వాటి సామర్థ్యానికి అనుగుణంగా పని చేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. జూ పార్క్, మీరాలం ట్యాంక్ సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అధునాతన వసతులతో హోటల్ నిర్మించాలని... సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (హెచ్ఎండీఏ ఏరియా) కార్యదర్శులు ఇలంబర్తి, టి.కె.శ్రీదేవి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎఫ్‌సీడీఏ కమిషనర్ కే.శశాంక, వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, మెట్రో రైలు ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఇ.వి. నరసింహారెడ్డి, జేఎండీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బిల్లు కోసం 72 గంటల నిరాహారదీక్ష

**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం 72 గంటల పాటు నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో యునైటెడ్ పూలే ఫ్రంట్, బీసీ సంఘాల నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆగస్టు 4వ తేదీన ఉదయం 11 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 11 గంటల వరకు ఇందిరాపార్క్ లోని ధర్నా చౌక్ లో నిరాహార దీక్ష చేస్తానని తెలిపారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ చేసిన పోరాటాలకు దిగివచ్చే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, కౌన్సిల్ లో బీసీల కోసం రెండు వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని కానీ ఇంతవరకు ఆ ప్రయత్నం చేయలేదున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ధర్నాను ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీనే పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు కూడా ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని చెప్పకుండా పార్టీ పరంగా ధర్నా చేస్తామని పిలుపునివ్వడం బీసీలను వంచించడమేనన్నారు. రాష్ట్ర హైకోర్టు చెప్పింది కాబట్టి సెప్టెంబర్ నెలాఖరులోకా ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్తోందని.. గడువులోగా ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో.. బీసీలకు రిజర్వేషన్ల కోటా పెంచడం కూడా అంతే ముఖ్యం అన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలుపకపోతే, రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర వేయకుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు న్యాయపోరాటం చేయలేదని ప్రశ్నించారు. తమిళనాడులో ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఆ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాటు న్యాయపోరాటం చేసి రిజర్వేషన్లు కల్పించిందని గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలోనూ ఎన్నికలు నిర్వహించాల్సిన అత్యవసరం ఏదీ లేదని.. రిజర్వేషన్ల కల్పనే ముఖ్యమన్నారు. బీసీ సీఎం, బీసీ పీఎం అంటున్న బీజేపీ తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు ఎందుకు అడ్డుతగులుతోందని ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ప్రయోజనం శూన్యమన్నారు. ఆర్డినెన్స్ విషయంలో న్యాయపోరాటం ఎందుకు చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రపతి బిల్లులకు ఆమోదం తెలిపితే సంతోషమని.. తెలుపకుండా రిజెక్ట్ చేస్తే మరోసారి శాసనసభ, శాసన మండలి ఆ బిల్లులకు ఆమోదం తెలిపితే రిజర్వేషన్లు అమలు చేసుకోవచ్చన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఎన్నో అవకాశాలు ఉన్నా తన బడే భాయ్ నరేంద్ర మోదీని రక్షించడం కోసమే రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం లేదన్నారు. బీజేపీతో ఉన్న ఒప్పందంతోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం లేదన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచాలంటే వెంటనే హైకోర్టు, సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి వెళ్లి ధర్నాచేస్తాం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటున్నారని.. ఢిల్లీలో ధర్నా అంటే అదేమైనా సత్రం భోజనమాఅని ప్రశ్నించారు.

# ట్రంప్ అబద్ధాల కోరు అని ప్రకటించాలి



మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఆపరేషన్ సిందూర్ విషయంలో కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించిందని లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ఆపరేషన్ సిందూర్‌లో మన పైలెట్లను ముందుకు పంపి వారి చేతులు కట్టేశారని పాక్ సైనిక స్థావరాలు, ఎయిర్ డిఫెన్స్‌ను ధ్వంసం చేయొద్దని చెప్పారని ఆరోపిం చారు. ప్రభుత్వ నిర్ణయాల వల్లే మన విమానాలు కూలాయని ఏఐఎఫ్ ఎటువంటి తప్పు చేయలేదు, తప్పు చేసింది రాజకీయ నాయకత్వం అని మండిపడ్డారు. ఆపరేషన్ సిందూర్ పై జరిగిన చర్చ సందర్భంగా లోక్ సభలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. ఓ వైపు సీజ్ ఫైర్ కు తానే కారణం అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 29 సార్లు చెప్పారని కానీ ఇప్పటి వరకు ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ఖండించలేదన్నారు. ఇందిరాగాంధీలో ఉన్న సగం ధైర్యం ప్రధాని నరేంద్ర మోడీకి ఉంటే సీజ్ ఫైర్ లో ట్రంప్ ప్రమేయం లేదని, ట్రంప్ అబద్ధాల కోరు అని సభలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. పహెల్గాం ఉగ్రదాడిలో అమాయలుకు చనిపోయారని పాక్ ఉగ్రవాదులు చేసిన దాడిని అందరూ ముక్తకంఠంతో ఖండిచారని రాహుల్ గాంధీ ఆపరేషన్ సిందూర్ లో మన సైనికులు గొప్ప ధైర్యసాహసాలు ప్రదర్శించారని ఈ పరేషన్ విషయంలో కేంద్రానికి ప్రతిపక్షాలు అన్ని సహకరించాయన్నారు. భారత సైన్యాన్ని పులితో పోల్చిన రాహుల్ గాంధీ.. పులికి స్వేచ్ఛఉంచాలన్నారు. త్రివిధ దళాలను సమర్థవంతంగా ఉపయోగించేందుకు రాజకీయ సంకల్పం ఉండాలన్నారు. 1971 లో జరిగిన యుద్ధంలో లక్ష మంది పాక్ సైనికులను భారత్ బందీలుగా పట్టుకుందన్నారు. ఆపరేషన్ సిందూర్ 22 నిమిషాల్లో పూర్తయిందని రక్షణ మంత్రి చెప్పారు. పాక్ సైనికుల శిబిరాలపై దాడి చేయలేదని ప్రభుత్వమే చెప్పింది. ఆపరేషన్ సిందూర్ విషయంలో మన సైనికుల చేతులు కట్టివేశారు. అర్ధరాత్రి 1:30 డీజీఎంవోతో మాట్లాడామని రాజ్ నాథ్ చెప్పారు. ఉద్రిక్తతలు పెంచే ఆలోచన లేదని పాక్‌తో చెప్పామని రాజ్ నాథ్ సింగ్ చెప్పారు. అంటే.. పాకిస్థాన్ తో పోరాడే ఆలోచన లేదని రాజ్ నాథ్ చెప్పారు. అసలు పాకిస్థాన్ తో యుద్ధం చేసే ఆలోచననే రాజ్ నాథ్ చెప్పకనే చెప్పారన్నారు. పహెల్గాం ఉగ్రదాడి తర్వాత ఏ ఒక్క దేశం కూడా పాకిస్తాన్ ను ఖండించలేదని కేవలం ఉగ్రవాదాన్ని మాత్రమే ఖండించాయన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారత్, పాక్ ను ఒక్కటిగా చూస్తున్నాయన్నారు. పహెల్గామ్ సూత్రధారి మునీర్ ట్రంప్ తో కలిసి భోజనం చేశారని విమర్శించారు.

# హైకోర్టు న్యాయమూర్తిపైనే అభ్యంతరకర వ్యాఖ్యలా..?



విశ్వంభర, ఢిల్లీ: భూ వివాదం వ్యవహారంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి మరోసారి ఊరట లభించింది. సొసైటీ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తనపై కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఫిర్యాదు దారు ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. రేవంత్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు అనంతరం.. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మంగళ వారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిస్మిస్ చేసింది.

**పిటిషనర్, న్యాయవాదిపై సుప్రీంకోర్టు ఆగ్రహం..**

పిటిషన్‌లో.. ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఒక న్యాయవాదిగా న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ .. పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్.పెద్దిరాజుతోపాటు ఆయన తరఫు న్యాయవాది రితేష్ పాటిల్‌కు ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్ పెద్దిరాజు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది రితీష్ పాటిల్ క్షమాపణ కోరారు. అందుకు నిరాకరించిన సీజేఐ.. పిటిషన్ రాసేటప్పుడు, దాఖలు చేసేటప్పుడు గుడ్డిగా ఎలా వేశారని ప్రశ్నించారు.

పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని న్యాయవాది రితీష్ పాటిల్ కోరగా.. అందుకు సీజేఐ నిరాకరించారు. పిటిషన్ దాఖలు చేసే ముందు న్యాయవాదిగా అన్ని విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. కోర్టు ధిక్కరణ నోటీసుపై లిఖిత పూర్వకంగా సమాధానం ఆదేశించారు. సమాధానం ఆమోదయోగ్యంగా ఉంటేనే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేస్తూ... విచారణ ఆగస్టు 11కు వాయిదా వేశారు.

# మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, హైదరాబాద్:మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లు తేలితే ఎవరైనా సరే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఛైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్ అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ పనిచేస్తుందని చెప్పారు. లగచర్ల ఘటన, గురుకుల పాఠశాల విద్యార్థుల విషయంపై భారత రాష్ట్ర సమితి నేతలు ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశారు. తమ పార్టీకి చెందిన నేతలు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎమ్మెల్సీ శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ వి.రామసుబ్రమణియన్ మాట్లాడారు. "అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి. రాష్ట్రానికి చెందిన 106 కేసులను పరిష్కరించాం. సీఎస్, డీజీపీ, జైళ్ల శాఖ డీజీ, అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించాం. రైతుల సమస్యలు, మహిళలు, చిన్నారులపై దాడులు, దివ్యాంగుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నాం. వసతిగృహాల్లో సౌకర్యాలలేమిపై అధికారులను ప్రశ్నించాం. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని.. ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో ఇవ్వాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించాం. మీడియా, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో




వాస్తవాలను బట్టి సుమోటోగా విచారణ చేపడుతున్నాం. పోలీస్, జ్యుడీషియల్ కస్టడీలో మృతి చెందిన ఘటనల్లో ప్రత్యేకంగా దర్యాప్తు చేయిస్తున్నాం. సహజ మరణమా?అధికారులు కారణమా? అనే విషయాలపై దర్యాప్తు చేయిస్తాం. పోలీసు, జైలు అధికారుల తప్పిదం ఉంటే చర్యలకు సిపార్సు చేస్తున్నాం. ఎన్‌హెచ్‌ఆర్‌సీలో 34,865 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో తెలంగాణకు సంబంధించి కేసులు 780 ఉన్నాయి" అని జస్టిస్ వి.రామసుబ్రమణియన్ తెలిపారు.

# జులై 31 నుంచి ఆగస్టు 6 వరకు పాదయాత్ర, శ్రమదాన కార్యక్రమాలు: మహేశ్‌కుమార్ గౌడ్

విశ్వంభర, హైదరాబాద్: జులై 31వ తేదీ సాయంత్రం నుంచి ఆగస్టు 6 వరకు పాదయాత్ర, శ్రమదాన కార్యక్రమాలు ఉంటాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. పాదయాత్ర పరిగి నుంచి ప్రారంభమై వరంగల్ వర్ధన్నపేట వరకు కొనసాగుతుందన్నారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి పది జిల్లా ఇన్‌ఛార్జిలు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో సమావేశం జరిగిందని, నామినేటెడ్ పోస్టుల కోసం సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. కార్పొరేషన్, డైరెక్టర్ల పోస్టులపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. బీసీ బిల్లు అమలు కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత 72 గంటల దీక్ష చేస్తానని ప్రకటించడంపై మహేశ్‌కుమార్ స్పందించారు. పదేళ్లు అధికారంలో ఉన్న కవిత.. అప్పుడెందుకు బీసీల గురించి మాట్లాడలేదని ప్రశ్నించారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడితే ఆమెను ఎవరూ నమ్మరని చెప్పారు.



గంగుల కమలాకర్ పదేళ్లు మంత్రిగా ఉండి బీసీల రిజర్వేషన్‌ను తగ్గిస్తే ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. ముఖేశ్ గౌడ్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారని, సీఎంతో మాట్లాడి ముఖేశ్ గౌడ్‌తోపాటు శివశంకర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల కొనుగోలుకు విశేష స్పందన..
# పోచారం ఫ్లాట్లకు జులై 31వరకు గడువు!



విశ్వంభర, హైదరాబాద్: నగరంలోని నాగోలు బండ్లగూడలో ఉన్న రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల కొనుగోలు కోసం విశేష స్పందన వచ్చినట్లు రాజీవ్ స్వగృహ ఎండీ గౌతమ్ వెల్లడించారు. ప్రాజెక్టులోని 159 ఫ్లాట్ల కోసం 1,900కి పైగా దరఖాస్తులు వచ్చాయని, చివరి రోజైన మంగళవారం 600 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. బుధవారం ఉదయం బండ్లగూడ ప్రాజెక్టు కార్యాలయంలో లాటరీ ద్వారా ఫ్లాట్లను కేటాయించనున్నట్లు చెప్పారు. లాటరీలో పేరు రాని వారు అదే ఈఎండీతో పోచారంలోని ఫ్లాట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆగస్టు 4, 5, 6 తేదీల్లో నిర్వహించే తొర్రూర్, బహదూర్ పల్లి, కుర్మల్ గూడా ప్రాంతాల్లోని ఓపెన్ ఫ్లాట్ల వేలం పాటలో కూడా పాల్గొనవచ్చని చెప్పారు. పోచారంలోని 601 ఫ్లాట్ల కోసం ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకునే వీలుందని తెలిపారు. వీటిని ఆగస్టు 1, 2 తేదీల్లో లాటరీ ద్వారా కేటాయిస్తామని ఎండీ గౌతమ్ వివరించారు.

## ఆ ఈవెంట్‌కు నా అనుమతి లేదు..
# ఎవరూ మోసపోవద్దు: నందమూరి బాలకృష్ణ

విశ్వంభర, హైదరాబాద్: బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి పేరిట మోసపూరిత ప్రకటనలు, కార్యక్రమాలను నమ్మి మోసపోవద్దని ఆస్పత్రి ఛైర్మన్, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆయన పోస్ట్ చేశారు.“ప్రజలకు హెచ్చరిక!. ‘బంగారు బాలయ్య–బసవతారకం ఈవెంట్’ పేరిట అశ్విన్ అట్లూరి అనే వ్యక్తి నా పేరు, బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి పేరును అనుమతిలేకుండా ఉపయోగిస్తూ విరాళాల సేకరణ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఈవెంట్‌కు నా అనుమతి లేదు. ఆస్పత్రి ట్రస్ట్ బోర్డు తరఫున ఎటువంటి అధికారిక ఆమోదం లేదు. దయచేసి ఈ రకమైన అనధికారిక, తప్పుదారి పట్టించే కార్యక్రమాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బసవతారకం ఆస్పత్రి తరఫున జరిగే అన్ని అధికారిక కార్యక్రమాలు, విరాళాల అభ్యర్థనలు కేవలం



ధ్రువీకరించిన, పారదర్శక మాధ్యమాల ద్వారానే నిర్వహిస్తాం. మోసపూరిత ప్రకటనలు, కార్యక్రమాలను నమ్మి మోసపోవద్దు అని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా” అని బాలకృష్ణ పేర్కొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మభ్యపెడుతోంది


## -మాజీ మంత్రి తలసాని



విశ్వంభర, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రజలను కాంగ్రెస్ మభ్య పెడుతోందని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చివరికి పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న నాటకాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. “బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ఎలా చేస్తారని అప్పుడు అడిగితే మా వ్యూహం మాకు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెపమంతా భాజపా, భారత రాష్ట్ర సమితిపై నెట్టేస్తోంది. 42 శాతం రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి. కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల విషయంలో బీసీలకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు? భారత రాష్ట్ర సమితి తరఫున కూడా రాష్ట్రపతిని కలిసి.. 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కోరతాం. అధికార యంత్రాంగంలోనూ కీలకమైన స్థానాలను ఓ అగ్రవర్ణం వారికే కార్పొరేషన్ పదవుల్లో సగం బీసీలకు ఇవ్వాలి” అని రాష్ట్ర ప్రభుత్వాన్ని తలసాని డిమాండ్ చేశారు.

# ఇండియన్ స్పెర్మ్ టెక్‌లో పోలీసుల తనిఖీలు

విశ్వంభర, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని ఇండియన్ స్పెర్మ్ టెక్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. క్లూస్ టీమ్ సహాయంతో గోపాలపురం పోలీసులు ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. పలువురి నుంచి సేకరించిన వీర్యకణాలకు సంబంధించిన మూడు డబ్బాలు, ఆధార్ కార్డులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిగా ఉన్న పంకజ్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఇటీవల సృష్టి టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్ అక్రమాలు బయటపడిన నేపథ్యంలో ఇండియన్ స్పెర్మ్ టెక్‌లో రోజువారీ కూలీలు, యాచకులు, పాదచారులకు కమీషన్ ఇచ్చి వీర్య కణాలు, అండాలను సేకరిస్తున్నారన్న సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు.



# మధ్యాహ్న భోజన పథకం నిధులు విడుదల



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం నిధులు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పథకం కింద ఒకటి నుండి ఎనిమిదో తరగతి విద్యార్థులకు వంట ఖర్చులు, వంట సహాయకుల గౌరవ వేతనం కోసం నిధుల మొత్తాన్ని విడుదల చేశారు. విడుదల చేసిన మొత్తం నిధులు రూ. 51,78,88,960 రూపాయలు ఈ ఏడాది ఏప్రిల్, జూన్ వరకు ఒక్కో జిల్లాకు రూ.1000 చొప్పున మంజూరు చేసింది. సింగిల్ నోడల్ ఏజెన్సీ ద్వారా ఈ నిధులు జిల్లాలకు చేరతాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దీని ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో చేపట్టిన పీఎం పోషన్ పథకం మరింత పటిష్టంగా అమలు అవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిధుల విడుదల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సజావుగా సాగడానికి తోడ్పడన్నాయి.

## పులులను సంరక్షించుకోవాల్సిన
# బాధ్యత మనందరిది


## - అనూప్ కుమార్ నాయక్



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: జీవ వైవిధ్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎన్టీసీఏ(నేషనల్ కన్సర్వేషన్ అథారిటీ) మాజీ సభ్యుడు, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి అనూప్ కుమార్ నాయక్ అన్నారు. మంగళవారం ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా దూలపల్లి లోని తెలంగాణ ఫారెస్ట్ అకాడెమీ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడారు. మన పర్యావరణ వ్యవస్థలలో పులులు పోషించే కీలక పాత్రను గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పెద్దపులి అంటే శక్తి, అందం యొక్క చిహ్నాలు మాత్రమే కాదు, అవి ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడే కీస్టోన్ జాతులు అని మనమందరం గ్రహించాలని కోరారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒక పులి మీద అడవి, పర్యావరణం, ప్రకృతి, జంతుజాలం, గడ్డి భూములు, జీవవైవిధ్యం వంటివి ఆధారపడి ఉన్నందున పులుల మనుగడ అనేది మానవాళి మనుగడకు కూడా ప్రధానమన్న విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. అటవీ దళాల ప్రధాన సంరక్షిణాధికారిణి %ణతీ%. సువర్ణ మాట్లాడుతూ పెద్దపులుల సంరక్షణపై ప్రజలల్లో అవగాహన కల్పించడంతో పాటు వారిని భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతీ ఏటా జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. పులుల ఆవాసాల సంరక్షణ, విస్తరణకు ప్రజల మద్దతు అవసరమని, పులుల సంరక్షణ గురించి అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని వెల్లడించారు. పెద్దపులుల సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయ న్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్)లను చాలా బాగా నిర్వహించడంతో పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న అటవీ, వన్యప్రాణుల సంరక్షణ చర్యలతో వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. ప్రత్యేకించి అమ్రాబాద్ అడవుల్లో పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని వాటి సంఖ్య 36 కు చేరుకుందని తెలిపారు. తెలంగాణలో మెరుగైన అటవీ విస్తరణ, వేటకు తగినసంఖ్యలో జంతువులు, నీటివనరులు వంటివి ఉండడంతో పొరుగున మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబాల్లో పులుల ఇక్కడకు తరలి వస్తున్నాయన్నారు. గడ్డిభూముల పెంపకంతో శాకాహార జంతువుల సంఖ్య బాగా పెరగడం కూడా దీనికి కలిసోస్తుందని చెప్పారు. చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఈలు సింగ్ మేరు మాట్లాడుతూ వన్యప్రాణులు – మానవుల మధ్య సంఘర్షణ నివారించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, పులులకు భద్రత, వాటి సహజ ఆవాసాల సమీప ప్రాంతాలలో నివసించే ప్రజల శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చే విధంగా టైగర్ ప్రాజెక్ట్‌ను పునరావిష్కరించుకునే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. కవ్వాల్ టైగర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతారాం. నాగర్ కర్నూల్ డీఎఫ్‌వో రోహిత్ కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కు సంబందించిన అన్ని వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి వాటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమలో వైల్డ్ లైఫ్ కు విశేష సేవలు అందించిన అటవీ అధికారి శంకరన్ ను అధికారులందరూ ఘనంగా సత్కరించారు. పీసీసీఎఫ్(ఐటీ వింగ్) జవహరి, టీజీఎఫ్‌డీసీ ఛైర్మన్ సునీత, ఎం.భాగవత్ తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ ఎస్‌జె ఆశ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ‘ఐసీయూ’ చికిత్స ఆలస్యంతో యువకుడి మృతి..

## ఆసుపత్రికి రూ.18లక్షల జరిమానా



విశ్వంభర, నేషనల్ బ్యూరో: అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన ఓ యువకుడికి సరైన చికిత్స అందలేదు. ఎమర్జెన్సీ సమయంలో ఐసీయూకి తరలించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, చివరకు ఆలస్యం కావడంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. దీనిని సేవాలోపంగానే పరిగణించిన వినియోగదారుల కమిషన్.. సంబంధిత ఆసుపత్రికి రూ.18లక్షల జరిమానా విధించింది. మహారాష్ట్రలో 2010లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఇటీవల తీర్పు వెలువడింది. నాసిక్‌కు చెందిన ఓ యువకుడు 2010 ఏప్రిల్ 15న అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతడి తండ్రి స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రితో చేర్పించాడు. మరుసటి రోజు తెల్లవారుజామున బాత్‌రూమ్‌కు వెళ్తున్న సమయంలో బాధితుడు ఛాతీ నొప్పితో కింద పడిపోయాడు. పరిస్థితి క్షీణిస్తున్నట్లు కనిపించినప్పటికీ ఆసుపత్రి వర్గాలు మాత్రం ఐసీయూలో చేర్చలేదు. ఉదయం 7గంటలకు అత్యవసర చికిత్స అందించే ప్రయత్నాలు చేశారు. అప్పటికే ఆలస్యం కావడంతో చివరకు మధ్యాహ్నం 12.50గంటలకు మరణించినట్లు అధికారులు ప్రకటించారు.తన కుమారుడు ఉదయం 8గంటల సమయంలోనే మరణించాడని, చికిత్స చేసినట్లు ఆధారాలు సృష్టించడానికి మధ్యాహ్నం వరకు వైద్యులు చికిత్స కొనసాగించారని యువకుడి తండ్రి ఆరోపించాడు. ఆసుపత్రి, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొంటూ తొలుత జిల్లా వినియోగదారుల ఫోరమ్‌కు వెళ్లాడు. ఐసీయూ పర్యవేక్షణ అవసరమైనప్పటికీ వైద్యులు సరిగ్గా వ్యవహరించలేదని, ఈ క్రమంలోనే గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయాడని చెప్పాడు. జిల్లా ఫోరమ్ దీనిని తిరస్కరించడంతో రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (%ాజణ=జ%)ను బాధితుడు ఆశ్రయించాడు.అనుభవం, నైపుణ్యమున్న వైద్యులే చికిత్స చేశారని, ఎటువంటి నిర్లక్ష్యం, సేవాలోపం ఏమీ లేదని ఆసుపత్రి యాజమాన్యం కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది. దీర్ఘకాల ఆరోగ్య పరిస్థితుల కారణంగానే అతడు మరణించాడని, ఐసీయూ అడ్మిషన్‌కు బాధితుడి తండ్రే నిరాకరించాడని పేర్కొంది. అయితే, ప్రాణాపాయ పరిస్థితుల్లో ఐసీయూ అడ్మిషన్‌కు చట్టపరంగా సమ్మతి అవసరం లేదని సుప్రీం కోర్టు చెప్పిన విషయాన్ని కమిషన్ ప్రస్తావించింది. ఎమర్జెన్సీలో ఆలస్యం చేస్తే ప్రాణాంతకమన్న అంశాన్ని గుర్తుచేసింది. జీవించే హక్కులో అత్యవసరమైన వైద్య సంరక్షణ కూడా ఒక భాగమని తెలిపింది. ఈనేపథ్యంలో మృతుడి కుటుంబీకులు పడిన మానసిక వేదనను పరిగణనలోకి తీసుకొని సదరు ఆసుపత్రికి రూ.18లక్షలు జరిమానా విధించింది. 2010 అక్టోబర్ నుంచి 6శాతం వడ్డీ కలిపి బాధితులకు ఇవ్వాలని ఆదేశించింది.

## భారత భూభాగంలోకి చైనా
# ఒక్క అంగుళం కూడా చొరబడలేదు: రిజిజు

విశ్వంభర, నేషనల్ బ్యూరో: భారత భూభాగంలోకి చైనా ఒక్క అంగుళం కూడా చొరబడలేదని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని చెప్పారు. 1962 నుంచి ఇదే పరిస్థితి అని మంగళవారం లోక్‌సభకు వెల్లడించారు. రికార్డులను సరిచేయడం ఎంతోముఖ్యమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.“నా సొంతరాష్ట్రంలోకి చైనా ప్రవేశించి, ఆక్రమణలకు పాల్పడిందని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వడం ముఖ్యమని నేను భావించాను. అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం చైనా అధీనంలో ఉన్న ప్రాంతం 1962 యుద్ధానికి ముందు లేదా ఆ సమయంలో ఆక్రమించారు. ఆ తర్వాత అలాంటి పరిస్థితి తలెత్తలేదు” అని వెల్లడించారు. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమించిందని గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. అరుణాచల్‌ప్రదేశ్ లోని పలు ప్రాంతాల పేర్లను మార్చడానికి డ్రాగన్ యత్నించింది. దానిని పలుమార్లు భారత్ తిరస్కరించింది కూడా. “అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని.. అది విడదీయరాని




భాగమని.. పేర్లు మార్చినంత మాత్రాన ఈ వాస్తవాన్ని మార్చలేరు” అని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఇక గత ఏడాది ఈ ఆసియా దేశాల మధ్య గస్తీ దోస్తీ కుదిరింది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న సంబంధాలు.. ఆ ఒప్పందం తర్వాత కాస్త మెరుగయ్యాయి.

# సంగారెడ్డి కలెక్టర్ కు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



విశ్వంభర, సంగారెడ్డి: సంగారెడ్డి కలెక్టర్ పి. ప్రావీణ్యను సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. సంగారెడ్డి జిల్లాలోని హత్నూర కేజీబీవీ పాఠశాల సందర్శించి విద్యార్థులతో కలిసిమెలిసి ఉంటూ పరిస్థితులను ప్రత్యేకంగా పర్యవేక్షించిన కలెక్టర్ పి. ప్రావీణ్యను సీఎం ప్రశంసించారు. అయితే ఇటీవల హత్నూర కేజీబీవీ పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈక్రమంలో పాఠశాలను సందర్శించి, సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా వి హెూదాలో ఉండి కూడా విద్యార్థులతో మమేకం అయి, వారితో ఒకరోజంతా గడిపి, వారిలో స్ఫూర్తి నింపిన తీరుకు సీఎం ఆమెను కొనియాడారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి గతంలో సంగారెడ్డి పర్యటనలో భాగంగా హత్నూర కేజీబీవీ పాఠశాలలో పలు భవనాలకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే.

# గందరగోళంలో బీసీ రిజర్వేషన్లు...



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వగలమా?. ఇవ్వాల్సి వస్తే... అందుకు అనుసరించాల్సిన విధానాలు, పద్ధతులు ఏమున్నాయి?. వాటిని సాధించుకోవడం ఎలా? ... అధికారపక్షాలైనా, ప్రతిపక్షాలైనా వాటిని అనుసరించాల్సి ఉంటుంది. కానీ, తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల మాత్రం విచిత్రంగా ఉన్నది. "అందరూ శాఖాహారులే... రొయ్యలముల్లేడ పోయే..." అన్న చందంగా మారినది. బీసీ రిజర్వేషన్లకు సరే అంటూనే... వాటిని అమ్లు చేయలేకపోతే... ఆ నెపాన్ని ప్రత్యర్థి పార్టీలపై నెట్టాలని చూస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలలో.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్ కు పంపింది. దీనిని పరిశీలించాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ ఈ ఆర్డినెన్స్ ను కేంద్ర హెూం శాఖకు పంపారు. ప్రస్తుతం అది కేంద్రం పరిశీలనలో ఉన్నది. బీసీలకు రిజర్వేషన్లు అమలయితే ఆ క్రెడిట్ తమకే దక్కాలని రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయి. ఈ ఆర్డినెన్స్ ద్వారా బీసీల రిజర్వేషన్ అమలు అయితే క్రెడిట్ తమకే దక్కుతుందని అధికార కాంగ్రెస్ పార్టీ భావన. ప్రస్తుతం ఈ ఆర్డినెన్స్ కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలకు వెళ్లడంతో బాల్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, పార్టీ చేతుల్లోకి చేరింది. ఎలాగైనా రిజర్వేషన్లు సాధిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. రిజర్వేషన్ల సాధన కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమ బాటను కూడా ఎంచుకుంది. ఆగస్టు 6న ఢిల్లీలో ధర్నాకు పిలుపునిచ్చింది. బీసీ రిజర్వేషన్లను



జాతీయ అంశంగా మార్చి ఇండి యా కూటమి పార్టీలను ఏకతాటికీ తెచ్చే ప్రయత్నం ఇప్పటికే ప్రారంభి ంచింది. కాంగ్రెస్ అగ్ర నేతలు ఖర్గే, రాహుల్ సైతం బీసీ రిజర్వేషన్ డిమాండ్‌ను తీవ్రతరం చేశారు. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ లో ముస్లిం మైనార్టీలకు కూడా అవకాశం కల్పించడాన్ని రాష్ట్ర బీజేపీ వ్యతిరేకిస్తుంది. తాము మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకమని చెబుతోంది. ఈ ఆర్డినెన్స్ ను వ్యతిరేకిస్తూ... హైదరాబాదులో ధర్నా చేయాలని రాష్ట్ర బీజేపీ నిర్ణయించింది. ఎలాగైనా బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంది. అందుకోసం ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తామని చెప్తుంది. జిల్లాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది, బీఆర్ఎస్ పార్టీకే చెందిన ఎమ్మెల్సీ కవిత మాత్రం ఆగస్టు 4న ఢిల్లీలో మూడు రోజుల దీక్ష కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ మూడు పార్టీల వైఖరి రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఆర్డినెన్స్ లో ముస్లింలను చేర్చడానికి తప్పు పడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. . తెలంగాణ రాష్ట్రంలో నిరసనలకు పిలుపునిచ్చింది. రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలు కోసం ఆర్డినెన్స్ తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీలో ఉద్యమాన్ని చేపడుతుంది. ఇక, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ ఉద్యమాలకు పిలుపునిచ్చింది. బీసీల రిజర్వేషన్ల విషయంలో రాజకీయ పార్టీలు ఎవరికి వారు తాము పోరాటం చేస్తున్నామన్న భ్రమ కల్పించే ప్రయత్నాలు చేస్తుంటాయా? ... అన్న విమర్శలు వినవస్తున్నాయి. ఈ రిజర్వేషన్ల విషయంలో ఎవరికి వారు ఇతర పార్టీలను దోషులుగా చేయాలని చూస్తున్నట్లుగా ఉన్నది.

రిజర్వేషన్లు 50 శాతం దాటి అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ జరగాలి... లేదా ప్రత్యేక పరిస్థితులను వివరిస్తూ రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలి. ఈ విషయం తెలిసి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్‌కు పంపింది. మరోవైపు పైగా ఈ రిజర్వేషన్ అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తుండడం గమనార్హం. ఇక, బీసీ రిజర్వేషన్లలో ముస్లిం మైనార్టీలు ఉండడాన్ని రాష్ట్ర బీజేపీ నేతలు వ్యతిరేకించడంపై కూడా విమర్శలు వస్తున్నాయి. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లలో ముస్లిం మైనార్టీలు కూడా ఉన్నారని కొందరు నేతలు గుర్తు చేస్తున్నారు. గుజరాత్ లో ఒకలా తెలంగాణలో మరోలా వారి తీరు ఉన్నదని పలువురు విమర్శిస్తున్నారు. ముస్లిం మైనార్టీల విషయాన్ని పక్కకు పెడితే... కేంద్రంలో తమ పార్టీ అధికారంలో ఉన్నందున బీసీ రిజర్వేషన్ అమలు కోసం రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చేలా పార్టీ అగ్రనాయకత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పిస్తాం అన్న స్పష్టమైన హామీ ఆ పార్టీ నుంచి ఇప్పటివరకు రాలేదు. ఈ రెండు పార్టీలు వీలైతే ఎవరికి వారు బీసీ రిజర్వేషన్ల క్రెడిట్ కొట్టేయాలని చూస్తున్నారు. అమలు జరగని పక్షంలో ఆ నెపాన్ని ప్రత్యర్థి పై వేయాలని చూస్తున్నట్లుగా ఉన్నది. ఇక బీఆర్ఎస్ పార్టీది విచిత్రమైన పరిస్థితి. ఈ రిజర్వేషన్లు ఎవరివల్ల అమలైనా కూడా ఆ క్రియేట్ తమకు దక్కే పరిస్థితి ఉండదన్నది బీ ఆర్ఎస్ అంతర్గత భావనగా ఉన్నది. పోరాటం అయితే చేద్దాం... అమలయితే పోరాట ఫలితం అని చెప్పవచ్చు... అమలు కాలేదా ఆ నెపాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై, పార్టీలపై నెట్టవచ్చు... అన్నట్లుగా బీఆర్ఎస్ తీరుగా ఉన్నది. రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉండి బీసీ రిజర్వేషన్లు సాధించుకోలేకపోవడం బీ ఆర్ఎస్ పార్టీకి ఒక మైనస్. ఈ మూడు పార్టీలు తీసుకున్న , అనుసరిస్తున్న తీరు బీసీ రిజర్వేషన్లను గందరగోళంలోకి నెట్టాయి.

సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాలు అమలవుతాయన్న గ్యారెంటీ లేదు. రిజర్వేషన్ల ఆర్డినెన్స్ కేంద్రం పరిశీలనలో ఉన్నదన్న విషయాన్ని హైకోర్టుకు తెలియజేయడం ద్వారా సెప్టెంబర్ 30లోగా ఎన్నికలను నిర్వహించాలన్న ఆదేశం నుంచి మినహాయింపు కోరవచ్చు. హైకోర్టు ఇచ్చిన గడువులో ఎన్నికలు నిర్వహించలేకపోయినప్పటికీ... తదుపరి అయినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరుగుతాయి? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.



బాశెట్టి శ్రావణ్ కుమార్,
సీనియర్ జర్నలిస్ట్.
7207201154

# ఉచితాలు సముచితమేనా..!



ఎన్నికల సమయంలో పార్టీలు వినిపించే ప్రధాన నినాదం ఉచిత పథకాలు, ఓటర్లు కూడా ఏ పార్టీ ఏ ఉచిత పథకాలు ఇస్తుంది అనే ధోరణిలోనే ఉన్నాయి ఉచితాల జాబితా రోజురోజుకు పెరుగుతుంది చివరికి ఇది దేశ ఆర్థిక వ్యవస్థ మోయలేని భారంగా మారుతోంది. ఇటీవల సుప్రీం కోర్ట్ కూడా ఎన్నికలకు ముందు ఉచితాలను ప్రకటించే పద్ధతిపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది, వీటి వలన ప్రజలు పని చేయడానికి ఇష్టపడటం లేదని కోర్టు పేర్కొంది.

ప్రభుత్వం ప్రజలకు ఉపాధి మార్గాలు చూపి,సంక్షేమాన్ని అందించి దేశాభివృద్ధికి దోహదపడేలా ప్రేరేపించాలని పేర్కొంది. ప్రజలకు మంచి సౌకర్యాలు అందించాలనే ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే.. కానీ వారిని సమాజాభివృద్ధిలో భాగం చేసే విధంగా అవి వుండాలి

**ప్రజాస్వామ్యంలో సంక్షేమం ముఖ్యం..**

ప్రజా స్వామ్యంలో సంక్షేమ పథకాలు అవసరం. పేదలకు ఆహారం, ఆరోగ్యం, విద్య లాంటి మౌలిక హక్కులు సక్రమంగా అందించాలి .జాతీయ ఆహార భద్రత, మధ్యాహ్న భోజన పథకం,రైతు భరోసా,వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లు,విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ఇలాంటివి అవసరమైన వారికి సమర్థవంతంగా అందితే అది సంక్షేమం. కానీ... ఇప్పుడు రాజకీయ పార్టీలు "ఓటు కొనే పథకాలు" గా ఉచితాలను వాడుతున్నాయి. ఉచిత హామీలతో ఓటర్లను ఆకర్షించి గెలవాలనే అధికారం చేపట్టాలనే దోరణి పెరుగుతోంది..

**ఉచితాలతో ఖజానా ఖాళీ..**

ఈ రాజకీయ ఉచితాల వల్ల ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతోంది. వివిధ రాష్ట్రాల్లో జీతాలు ఇవ్వలేని పరిస్థితి, అభివృద్ధి పనుల నిలిపివేత, అప్పుల పెరుగుదల వంటివి జరుగుతున్నాయి ఇవన్నీ ఉచితాల ఫలితాలు. వీటి వలన రాష్ట్రాలకు లక్షల కోట్లకుపైగా అప్పు ఉన్నట్లు రిజర్వ్ బ్యాంక్ నివేదిక తెలిపింది. ఇవి రాష్ట్రాలు దివాళా తీయడానికి అప్పుల పాలు కావడానికి కారణం అవుతున్నాయి. ఈ అప్పు చివరికి పన్నుల రూపంలో ప్రజలపైనే భారం అవుతోంది.ప్రభుత్వ ఆదాయాల్లో ఎక్కువ భాగం ఉచిత పథకాలకే వెళ్తోంది. అభివృద్ధి, మౌలిక వసతులపై పెట్టుబడి తగ్గిపోతోంది. "ఏమీ చేయకుండానే డబ్బు వస్తుంది" అనే భావన పని చేసే తత్వాన్ని దెబ్బతీస్తోంది.ప్రజలు ప్రభుత్వానికి అనుకూలంగా మారిపోతున్నారు. విమర్శించే స్వేచ్ఛను కోల్పోతున్నారు.ఉచిత పథకాలు కొంత మంది రాజకీయ నాయకులకు డబ్బును సంపాదించిపెట్టే దారులుగా మారుతున్నాయిఈ పథకాలు అర్హులకు చేరేదేమో గానీ దాని తాలూకు ఫలాలు మాత్రం అవినీతి తో కూడిన ఎంతో మంది రాజకీయ నాయకులను ధనవంతులుగా మారుతున్నాయి.ఈ రోజు నాయకులు చేసే ఖర్చులు, రేపటి తరాలు చెల్లించాల్సిన పన్నులుగా మారుతున్నాయి.అవసరమున్న వారికి అర్హులకు కాకుండా %-% అన్ని వర్గాలకు ఉచితాలు ఇవ్వడం వల్ల అసలైన లబ్ధిదారులకు ఈ పథకాలు అందకుండాపోతున్నాయి , ప్రభుత్వాల పై ఆర్థిక భారం పెరుగుతుంది.

**ప్రజలు ఆలోచించాలి..**

"ఈ ఉచితాల వెనుక డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది?".భవిష్యత్తు తరాలపై అప్పుల భారం పెరుగుతుంది. "ఉచితాల మత్తుతో నీ ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నావా?" అనేది ప్రజలు ఆలోచించాలి. ఉచితాల ఊబిలో సమాజాభివృద్ధి తిరోగమనం అవుతుంది. తద్వారా ఉద్యోగాలు లేని యువత, గిట్టుబాటు ధర లేని రైతులు, నిధుల లేమితో ప్రభుత్వాలుసతమతమవుతాయి పేద,మధ్యతరగతి వర్గాలకు ఉచిత పథకాలు కొంత వరకు ఆసరాగా నిలుస్తాయి కానీ అవి ఎంత వరకు వారికి చేరుతున్నాయి అనేది ముఖ్యం.. అలాగే వారిని అభివృద్ధి దిశగా నడిపించే దీర్ఘకాలిక ప్రణాళికలు, ఆచరణలు చేయడం చాలా అవసరం ప్రజలు చూడాల్సింది సంక్షేమం, అభివృద్ధి, ఉచిత పథకాల మాయాజాలలు కాదు రేపటి తారాల భవిష్యత్తు బాగుండాలంటే ఓటర్లు విజ్ఞతతో వ్యవహరించాలి.నగదు, డబ్బులు ఇవ్వడం కాదు ఉపాధి అవకాశాలు, ఉత్పత్తి మార్గాలు కల్పించాలి.ఆత్మగౌరవంతో జీవించే మార్గాలు చూపాలి అదే నిజమైన సంక్షేమం. అభివృద్ధి అంటే..ప్రజలకు అవకాశాలు కల్పించడం, వ్యవస్థలను బలోపేతం చేయడం, ఆదాయాన్ని పెంచే మార్గాలను చూపించడం,అభివృద్ధికి సరైన దారిని నిర్ణయించడం. ఈవిషయాలను ప్రజలు గుర్తించాలి.



జి. అజయ్ కుమార్
సామాజిక విశ్లేషకులు

# మెరిసే ధ్రువతారలే శాస్త్రవేత్తలు

"విజ్ఞానమనే వినీల ఆకాశంలో మెరిసే ధ్రువతారలే శాస్త్రవేత్తలు. శాస్త్రవేత్తల కృషి, పట్టుదల వారు ప్రపంచానికి అందించిన సేవలు వెలకట్టలేనివి." ఈ పుస్తకం పాఠశాల విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రంపై అత్యంత ఆసక్తిని రేకెత్తించి, పెంచగలిగే గొప్ప పుస్తకం. వృక్షశాస్త్ర అధ్యాపకుడైన సత్యనారాయణ ఈ పుస్తకంలో భారతీయ శాస్త్రవేత్తలు,పాశ్చాత్య శాస్త్రవేత్తల గురించి చక్కగా వివరించాడు. చరకుడు, కనాధుడు, శుశ్రుతుడు, ఆర్యభట్ట, వరాహమిహిరుడు, జగదీష్ చంద్రబోస్, సివి రామన్, ఎల్లాప్రగడ సుబ్బారావు, హెూమి జహంగీర్ బాబా, విక్రమ్ సారాభాయ్, హర గోవింద ఖురాన, ఎపిజే అబ్దుల్ కలాం వంటి ప్రసిద్ధ భారతీయ శాస్త్రవేత్తల కృషిని, ఆయా రంగాల్లో వారు చూపిన ప్రతిభను వారి ప్రత్యేకతలను చక్కగా ప్రేరణాత్మకంగా వివరించాడు.

అంతేకాకుండా వివిధ రంగాలలో ప్రాముఖ్యత కలిగిన పాశ్చాత్య శాస్త్రవేత్తలైన అరిస్టాటిల్, మైకేల్ ఫారడే, చార్లెస్ డార్విన్, లూయి ప్యాశ్చర్, అల్ఫ్రెడ్ నోబెల్, థామస్ అల్వా ఎడిసన్, నికోలా టెస్లా, మేడం క్యూరీ, అలెగ్జాండర్ ఫ్లెమింగ్, ఐన్ స్టీన్ గురించి విశ్లేషిస్తూ రాశాడు.


మానవునికి శాస్త్రీయ జ్ఞానం ఆధునికతను, అవసరాలను, ఆరోగ్యాన్ని కలిగించేదిగా మారిపోయింది. నూతన ఆవిష్కరణలన్ని మానవునికి సులభతరమైన జీవన విధానాన్ని అలవాటు చేశాయి. నాటి, నేటి, భావి ఆవిష్కరణలన్ని మానవుని శ్రేయస్సును కాంక్షించేవే. ఈ పరిశోధనలకు మూలం మానవుడి అవసరమే పరమావధి.

ప్రపంచ శాస్త్ర విజ్ఞాన రంగంలో భారతదేశం చారిత్రాత్మకంగా ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఈ విషయాన్ని బలపరచడానికి రావాల్సిన అవసరం ఉంది. "చరక సహిత" పుస్తకాన్ని రచించిన చరకుడు భారతీయ ఆయుర్వేద పితామహునిగా కీర్తింపబడ్డాడు. మొక్కల పై ఆధారపడే సహజ వైద్య విధానం ఆయుర్వేద విధానం. అల్లోపతిలో కూడా చికిత్స లేనటువంటి మొండి రోగాలకు ఈనాటికీ ఆయుర్వేదమే పెద్దదిక్కు. మానవ శరీరం వాయు, అగ్ని, జల, భౌమ్య, ఆకాశ, తత్వాలైన పంచభూతాలతో తయారవుతుందని, శరీరంలో ఏది తక్కువైనా రోగాల బారిన పడతామని చరక సంహిత తెలియజేస్తుంది. ఈ సందర్భంగా త్రిదోషాలైన వాత, పిత్త, కఫ విధానాన్ని పాటించే ఆయుర్వేద శాస్త్రం గురించి పరిశోధించి రచయిత రాశాడు. "విశ్వంలోని ప్రతి పదార్థం విడదీయరాని పరమాణువులతో నిర్మించబడి ఉంటుందని దేవుడనే వారు లేరని, ఆత్మ, మనసు కూడా పదార్థాలే" అని చెప్పిన నిరీశ్వర వాది, భారతీయ ప్రాచీన అణు సిద్ధాంత పితామహుడు కణాధుడు. ఈయన ప్రకారం "పదార్థమంతా అణువుల సంయోగం చేత సృష్టించబడి ఉంటుంది." ఆయా అణువుల గుణాలు, ధర్మాలు, సంయోగాన్ని అనుసరించి పదార్థం యొక్క భౌతిక రూపం, స్వభావాలు మారుతూ ఉంటాయని" ఈయన పేర్కొన్నాడు. అణువు రూపంలో ఉండే సహజ భౌతిక శక్తి మరియు సహజ మానవాతీత శక్తిని సవివరంగా చర్చించాడు. పంచభూతాలతో బాటుగా కాలం, అంతరిక్షం, మనస్సు, ఆత్మను కలిపి తొమ్మిది సహజ లక్షణాలను పదార్థానికి అన్వయం చేశాడు. ఇది ఇంకా లోతుగా పరిశోధించవలసిన శాస్త్ర విజ్ఞానం.

భారతీయ శస్త్ర చికిత్సకు పితామహుడు శుశ్రుతుడు. ఈయనే అనస్థీషియాను కనిపెట్టాడు. ఈయన రాసిన గ్రంథంలో "శుశృత సంహిత, చరక సంహిత, వాగ్బట సంహిత" అనే మూడు గ్రంథాల సారాంశాన్ని విస్తృతంగా చర్చించాడు. క్రీస్తుపూర్వం 617 కాలంనాటి ఈ శాస్త్రవేత్త "అష్టాంగ హృదయం" గురించి విపులంగా వివరించాడు. ఆయుర్వేద వైద్యంతో బాటు నయం చేయలేనటువంటి వివిధ రోగాలు, భగవంతుడు ఇచ్చిన శరీర నిర్మాణాన్ని సైతం శస్త్ర చికిత్సల ద్వారా మార్చగలిగే మనిషి యొక్క మేధో గొప్పదనాన్ని సమాజానికి సజీవంగా చేసి నిరూపించి చూపాడు. ఈయన రాసిన ఆయుర్వేద గ్రంథం రవాణా సదుపాయాలు పెద్దగా లేని ఆరోజుల్లో అరబిక్ మరియు ఆంగ్లంలో అనువాదం జరిగి ప్రపంచ దేశాలకు విస్తరించింది. ప్రపంచానికి సున్నాను పరిచయం చేసిన ప్రాచీన భారతీయ అతి గొప్ప గణిత ఖగోళ శాస్త్రవేత్త ఆర్యభట్ట. మానవ శరీరమే కాదు విశ్వ శరీరాన్ని అర్థం చేసుకోవడానికి ఈయన ప్రయోగాలు ప్రపంచానికి ఉపయోగపడ్డాయి. గొప్ప వైద్య శాస్త్రవేత్త ధన్వంతరి, కవి కాళిదాసు కూడా ఈయన సమకాలీకులే. భూమి గుండ్రంగా ఉంటుందని, సూర్యుడు చుట్టూ భూమి ఇతర గ్రహాలు తిరుగుతాయని ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఈయన చెప్పాడు. వరాహమిహిరుడు మరో గొప్ప ఖగోళ గణిత శాస్త్రజ్ఞుడు. గ్రహగతులను, జాతకం, జ్యోతిష్యం లాంటి శాస్త్రాలకు అన్వయిస్తూ "పంచ సిద్ధాంతిక" గ్రంథంలో సౌర సిద్ధాంతాన్ని, విశ్వ రహస్యాలను తెలియజేశాడు.

భారతదేశ సంస్కృతిలో చెట్టుతో, పుట్టతో, పాముతో, చీమతో మానవుడు గొప్ప మానవత్వంతో నడుచుకుంటాడు. వాటిపై దైవిక భావన కలిగి ఉంటాడు. శాస్త్రవేత్తలు కూడా సగటు భారతీయుల సంస్కృతిని సమర్థిస్తున్నట్టుగానే పరిశోధనలు జరిపినట్టు అర్థమవుతుంది. అనేక క్లిష్ట సమస్యల పరిష్కారం అత్యంత సాధారణంగా ఉంటుంది. ఈ భూమిపై మనిషికే కాదు మొక్కలకు స్థానం, ప్రాణం ఉంటుందని శాస్త్రీయంగా నిరూపించిన భారతీయ శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్. "కెస్కో గ్రాఫ్" పరికరంతో ఈయన మొక్కలలో ఉండే సజీవ కదలికలను నిరూపించాడు. ఇది ప్రపంచాన్ని నివ్వెరపరిచే అంశం.జాతీయ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటున్న ఫిబ్రవరి 28 సివి రామన్ పుట్టినరోజు. సహజంగా వస్తువు చూడడానికి కాంతి అవసరం. కాంతి పడితే వస్తువు దృశ్యమానం అవుతుంది. అయితే "పదార్థంపై కాంతి పడినప్పుడు, కాంతిలో కలిగే మార్పు" ను గురించి రామన్ చేసిన పరిశోధన ప్రపంచవ్యాప్తంగా రామన్ ఎఫెక్ట్ అయింది. ఇవాళ జియో నెట్ ద్వారా వేగవంత డేటా ట్రాన్స్ఫర్ సాంకేతికతను వాడుతున్నం. ఆప్టికల్ ఫైబర్, వైద్య, అంతరిక్ష, సాంకేతిక రంగాలతో బాటుగా రామన్ ఎఫెక్ట్ అనేక రంగాలలో గొప్ప ఆవిష్కరణలకు మూలమైంది. దేశభక్తి, స్వతంత్ర ఆలోచన, శాస్త్రీయ విజ్ఞానంపై జిజ్ఞాస వంటి సివి రామన్ లోని గొప్పగుణాలు ఈ తరం పిల్లలు నేర్చుకోవాల్సిన విషయాలు.

"మిరాకిల్ మ్యాన్ ఆఫ్ మిరాకిల్ డ్రగ్ " గా ప్రసిద్ధిగాంచిన డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు మన తెలుగువాడు. మలేరియా, ప్లేగు, ఫైలేరియా, అనీమియా, సోరియాసిస్, స్ప్రూఫ్ మరియు బి12 విటమిన్ లోపం వల్ల వచ్చే అనేక రకాల వ్యాధులకి మందులు కనిపెట్టి ప్రసిద్ధి గాంచారు. ప్రపంచవ్యాప్తంగా నిత్యం అనేక మంది జీవితా లను కాపాడే రోగ నిరోధక ఔషధం



"టెట్రాసైక్లిన్". దీనిని కనిపెట్టిన శాస్త్రవేత్త సుబ్బారావు. భారతీయ అణు భౌతిక శాస్త్ర పితామహుడు హెూమి జహంగీర్ బాబా. భారతదేశానికి అణు పరీక్షలను నిర్వహించగలిగే సత్తా ఉందని ప్రపంచానికి చాటిన ధీరుడాయన. భారతీయ మొట్టమొదటి అణు రియాక్టర్ "అప్సర"అనేది వీరి ఆధ్వర్యంలోనే ప్రారంభించడం జరిగింది.

భారత అంతరిక్ష పరిశోధన పితామహుడుగా విక్రమ్ సారాభాయ్ కాస్మిక్ కిరణాలలో మార్పు, గ్రహాంతర స్థలాలు, సూర్యుడికి భూమికి మధ్యనున్న సంబంధం, భూ అయస్కాంత క్షేత్రం... ఇలా అనేక అంశాలపై పరిశోధన చేసినటువంటి గొప్ప శాస్త్రవేత్త.

సింథటిక్ బయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, జన్యు సంకేతం వంటి అంశాలపై పరిశోధన జరిపి ప్రపంచవ్యాప్తంగా పేరు సంపాదించుకున్న నోబెల్ బహుమతి గ్రహీత హర గోవింద ఖురాన. సాంకేతిక శాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఎలాగో జీవ సాంకేతిక శాస్త్రంలో మాలిక్యులర్ బయాలజీ అదేవిధంగా అధునాతనమైనది. జన్యు వ్యక్తీకరణను అర్థం చేసుకుంటే ఉత్తమమైన మానవ సమాజాన్ని నిర్మించడానికి సులభమవుతుంది. ఈ అన్వేషణలో మొదటి అడుగు వేసిన వారు ఖురానా. భారత మొదటి పౌరుడుగా, మిస్సైల్ రంగానికి పితామహుడుగా, ప్రొఫెసర్ గా, తత్వవేత్తగా, రాష్ట్రపతిగా, భారతరత్నగా, అజాతశత్రువుగా కీర్తి సంపాదించిన భారతీయ ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం. భారతదేశ అమ్ముల పొదిలో అగ్ని, నాగ్, ఆకాష్, పృథ్వి, త్రిశూల్ లాంటి ఎన్నో క్షిపణులను వారు అందించారు. దేశానికి శత్రుభయం లేకుండా చేశారు. ఈ పుస్తకంలో భారతీయ శాస్త్రవేత్తలనే కాకుండా గొప్ప గొప్ప ఆవిష్కరణలతో ప్రపంచగతిని మార్చిన పాశ్చాత్య శాస్త్రవేత్తల గురించి కూడా ఈ పుస్తకంలో చర్చించడం చాలా బాగుంది.

## బీసీసీఐ కార్యాలయం నుంచి

# ఐపీఎల్ జెర్సీల చోరీ



విశ్వంభర, స్పోర్ట్స్: ముంబయి వాంఖడే స్టేడియంలోని బీసీసీఐ కార్యాలయం నుంచి 6.5 లక్షల రూపాయల విలువైన ఐపీఎల్ 2025 జెర్సీలు చోరీకి గురయ్యాయి. నిందితుడైన సెక్యూరిటీగార్డు ఫరూఖ్ అస్లాం ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. అతడు దాదాపు 261 జెర్సీలను దొంగిలించినట్లు తెలుస్తోంది. ఒక్కోదాని ఖరీదు సుమారు 2,500 రూపాయలు ఉంటుందని అంచనా. ఆన్‌లైన్ జూదానికి బానిసైన సెక్యూరిటీగార్డు ఈ చోరీకి పాల్పడ్డాడని పోలీసుల విచారణలో తేలింది. అయితే జెర్సీలు వేరు వేరు జట్లకు చెందినవి అయినప్పటికీ, అవి ఆటగాళ్ల కోసమా.. లేక అభిమానుల కోసమా అనేది కచ్చితంగా తెలియదు. ఆ సెక్యూరిటీ గార్డు తాను దొంగిలించిన జెర్సీలను హరియాణాకు చెందిన ఆన్‌లైన్ డీలర్‌కు విక్రయించాడు. ఈ డీల్ కోసం నిందితుడు, అతణ్ని సోషల్ మీడియా ద్వారా సంప్రదించాడు. ఈ దొంగతనం జూన్ 13న జరిగినప్పటికీ ఆలస్యంగా వెలుగు చూసింది. స్టోర్‌రూమ్‌లో స్టాక్ మిస్సయినట్లుగా ఆడిట్‌లో తేలడంతో ఈ చోరీ ఉదంతం బయటకు వచ్చింది. బీసీసీఐ అధికారులు సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించగా, ఆ సెక్యూరిటీ గార్డు జెర్సీలను ఒక పెట్టెలో పెట్టుకొని వెళ్లిపోయినట్లు గుర్తించారు. ఆ జెర్సీలను తాను కొరియర్ ద్వారా ఆన్‌లైన్ డీలర్‌కు పంపినట్లు నిందితుడు తెలిపాడు. అయితే ఎంత మొత్తానికి అమ్మింది ఇంకా తెలియాల్సి ఉంది. సెక్యూరిటీ గార్డు నుంచి జెర్సీలను కొనుగోలు చేసిన డీలర్‌ను విచారణ కోసం పోలీసులు హరియాణా నుంచి పిలిపించారు. అయితే జెర్సీలు దొంగిలించిన విషయం తనకు తెలియదని డీలర్ పోలీసులకు తెలిపాడు. 'కార్యాలయంలో జరుగుతున్న పునరుద్ధరణ పనుల కారణంగా, స్టాక్ క్లియరెన్స్‌లో భాగంగా జెర్సీలు అమ్మకానికి ఉన్నాయని గార్డు తనకు చెప్పాడు' అని ఆన్‌లైన్ డీలర్ పోలీసుల విచారణలో వాపోయాడు. చోరీకి గురైన వాటిలో 50 జెర్సీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీలర్ నుంచి నేరుగా తన బ్యాంకు ఖాతాకు డబ్బులు వచ్చాయని నిందితుడు తెలిపాడు. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఆ మొత్తాన్నీ పోగొట్టుకున్నానని అతడు తెలిపాడు. దీంతో ఆ సెక్యూరిటీ గార్డు బ్యాంక్ ఖాతాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. అయితే.. జెర్సీలు మిస్సయిన విషయమై జులై 17న బీసీసీఐ అధికారులు మెరైన్ డ్రైవ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# ఐదో టెస్టుకు అర్ష్‌దీప్.. టీమ్ఇండియాలో కీలక మార్పులు!



విశ్వంభర, స్పోర్ట్స్: ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను ఎలాగైనా డ్రా చేయాలని టీమ్ ఇండియా తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇప్పటికే లండన్ చేరుకున్న గిల్ సేన కసరత్తు ముమ్మరం చేసింది. అంతేకాకుండా జట్టు కూర్పులోనూ కీలక మార్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని అర్ష్‌దీప్ సింగ్ ఐదో టెస్టులో అరంగేట్రం చేయనున్నట్లు సమాచారం. నాలుగో టెస్టులో ఆడించేందుకు తొలుత యాజమాన్యం భావించింది. అయితే నెట్ సెషన్‌లో బౌలింగ్ చేస్తూ అర్ష్‌దీప్ గాయపడ్డాడు. అతడి ఎడమ చేతి బొటనవేలికి గాయమై మ్యాచ్‌కు దూరమయ్యాడు. తాజాగా మంగళవారం లండన్‌లోని ఓవల్ మైదానంలో అర్ష్‌దీప్ బౌలింగ్ చేస్తూ కనిపించాడు. చురుగ్గా బంతులు విసురుతున్నాడు.. దీనిని బట్టి గాయం నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధించినట్లు కనిపిస్తోంది. దీంతో తుది జట్టులో అతడి పేరు దాదాపు ఖాయమైనట్లే! ఈ ఎడమ చేతివాటం పేస్‌బౌలర్ ఇప్పటి వరకు 21 టెస్టులు ఆడి.. 66 వికెట్లు పడగొట్టాడు. అంతేకాకుండా భారత్ జట్టులో ఉన్న ఏకైక ఎడమచేతి వాటం బౌలర్ అతడే. ఇంగ్లాండ్ బ్యాటర్ల దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో అర్ష్‌దీప్ విజయవంతం కాగలడని జట్టు యాజమాన్యం భావిస్తోంది. మాంచెస్టర్ టెస్టులో తీవ్ర నిరాశ పరిచిన కొత్త పేసర్ అన్షుల్ కాంబోజ్‌కు తుది జట్టులో స్థానం దక్కే అవకాశాలు కనిపించడం లేదు. అంతేకాకుండా ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ కూడా అనుమానమే. తొలి టెస్టులో పేలవ ప్రదర్శన చేశాక తర్వాతి రెండు మ్యాచ్‌లకు శార్దూల్‌ను పక్కన పెట్టిన జట్టు యాజమాన్యం.. నితీశ్, ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్‌ల గాయాల నేపథ్యంలో అతణ్ని నాలుగో టెస్టులో ఆడించింది. బ్యాటింగ్‌లో పర్వాలేదనిపించినప్పటికీ.. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి శార్దూల్ ఒక్క వికెట్టూ తీయలేకపోయాడు. మరోవైపు గాయం కారణంగా నాలుగో టెస్టుకు దూరమైన ఆకాశ్ దీప్ కూడా కోలుకున్నట్లు ప్రధాన కోచ్ గంభీర్ మాంచెస్టర్ మ్యాచ్ తర్వాత వెల్లడించాడు. తాజా పరిస్థితుల నేపథ్యంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకోకపోతే.. అర్ష్‌దీప్ సింగ్ , ఆకాశ్ దీప్‌లను తుది జట్టులోకి తీసుకోవడం లాంఛనమే. ఒకవేళ చివరి మ్యాచ్‌లో బుమ్రాకు విశ్రాంతి ఇస్తే మరిన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశముంది. అయితే, పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్న అతడికి కీలక మ్యాచ్‌లో విశ్రాంతి ఇవ్వకపోవచ్చు.

# శుభ్‌మన్ గిల్ మరోసారి తానేంటో నిరూపించుకున్నాడు: రవిచంద్రన్ అశ్విన్



**విశ్వంభర, మాంచెస్టర్:** ఇంగ్లాండ్‌తో మాంచెస్టర్‌లో టీమ్ఇండియాకు జరిగిన నాలుగో టెస్టులో రాణించిన గిల్.. మరోసారి తానేంటో నిరూపించుకున్నాడని అశ్విన్ అన్నాడు. గిల్ తన తప్పుల నుంచి నేర్చుకుంటాడని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడాడు. లార్డ్స్ టెస్ట్‌లో విఫలం కాగానే శుభ్‌మన్‌గిల్‌ను చాలామంది విమర్శించారు. అతడి బ్యాటింగ్ టెక్నిక్ మీద సందేహాలు వెలిబుచ్చారు. కానీ అతడు మాంచెస్టర్ టెస్ట్‌లో తన ఇన్నింగ్స్ ద్వారా వాటన్నింటినీ పటాపంచలు చేశాడని అశ్విన్ కొనియాడాడు. 'శుభ్‌మన్ గిల్ అద్భుతమైన సెంచరీ చేసి తానేంటో మరోసారి నిరూపించుకున్నాడు. అతడు తన టెక్నిక్ మీద కసరత్తు చేశాడు. కానీ అతడు కెప్టెన్‌గా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోలేదు. వాషింగ్టన్ సుందర్‌ను ఆలస్యంగా తీసుకురావడం చాలా పెద్ద తప్పిదం. కానీ ఇలాంటివి జరుగుతుంటాయి. గిల్ ఇంకా యువకెప్టెనే కాబట్టి.. అతడు తన తప్పుల నుంచే నేర్చుకుంటాడు. అయితే అతడు చాలా త్వరగా నేర్చుకుంటాడని నేను ఆశిస్తున్నా' అని అశ్విన్ అన్నాడు. బ్యాటింగ్‌లో గిల్ విజయాల గురించి కూడా అశ్విన్ మాట్లాడాడు. 'శుభ్‌మన్ గిల్ బ్యాటర్‌గా అద్భుతంగా రాణిస్తున్నాడు. బర్మింగ్‌హామ్, హెడింగ్లీలో అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. లార్డ్స్‌లో టీమ్ఇండియా టెస్ట్ మ్యాచ్ ఓడిపోగానే చాలామంది గిల్ బ్యాటింగ్‌ను ప్రశ్నించారు. కానీ అతడు తిరిగి పుంజుకున్నాడు' అని అశ్విన్ విశ్లేషించాడు. అలాగే రవిచంద్రన్ అశ్విన్ టీమ్ఇండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఓ సలహా ఇచ్చాడు. 'దయచేసి ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకోండి. ఎందుకంటే టెస్ట్ మ్యాచ్‌లు బ్యాటింగ్ డెప్త్ ద్వారా గెలవలేం. డ్రా మాత్రం చేసుకోవచ్చు. వికెట్లు తీయగల నేర్పున్న బౌలర్లు టీమ్‌లో ఉంటేనే టెస్ట్ మ్యాచ్‌లను గెలవగలం' అని రవిచంద్రన్ అశ్విన్ కుండబద్దలు కొట్టాడు.

# బ్యాటింగ్ విభాగం బాగుంది.. బౌలింగ్ దళం మెరుగుపడాలి: అజింక్య రహానే



విశ్వంభర, స్పోర్ట్స్:టెండూల్కర్ – అండర్సన్ ట్రోఫీలో భాగంగా టీమ్ఇండియా , ఇంగ్లాండ్‌ల మధ్య జులై 31 నుంచి చివరిదైన అయిదో టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఈ పోరుకు ముందు అజింక్య రహానే టీమ్ఇండియా లోపాలను సవరించుకోవాలని కీలకమైన సూచనలు చేశాడు. భారత జట్టు బ్యాటింగ్ విభాగం అద్భుతంగా ఉన్నప్పటికీ, బౌలింగ్ దళమే సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉందన్నాడు. ఈ మేరకు తన యూట్యూబ్ ఛానల్‌లో అతడు వ్యాఖ్యానించాడు. 'టీమ్ఇండియా బాగా ఆడుతోంది. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగం అద్భుతంగా రాణిస్తోంది. బౌలింగ్ దళంతోనే కాస్త ఇబ్బంది ఎదురవుతోంది. ఒకరిద్దరు బౌలర్లు చక్కగా బౌలింగ్ చేస్తున్నారు. కానీ వారికి ఇతర బౌలర్ల నుంచి సరైన మద్దతు లభించడం లేదు' అని అజింక్య రహానే వాపోయాడు. ఈ సిరీస్‌లో టీమ్ఇండియా బౌలర్లు.. పరుగులు చేయకుండా ఇంగ్లాండ్ బ్యాటర్లకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ముఖ్యంగా మాంచెస్టర్ టెస్ట్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్లు ఒక ఇన్నింగ్స్‌లోనే ఏకంగా 669 పరుగులు చేశారు. ఒకవేళ ఈ మ్యాచ్.. రెండో ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ , రవీంద్ర జడేజా , వాషింగ్టన్ సుందర్ సెంచరీలు చేసి ఆదుకోకపోయి ఉంటే.. టీమ్ఇండియా ఓటమిపాలై ఉండేది. నితీశ్‌కుమార్ రెడ్డి , ఆకాశ్ దీప్ గాయాల పాలవడంతో మాంచెస్టర్ టెస్ట్‌లో టీమ్ఇండియా బౌలింగ్ రిజర్వ్ బలహీనంగా మారింది. లార్డ్స్ టెస్ట్‌లో ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ బంతితో ఆకట్టుకున్నాడు. అలాగే బర్మింగ్‌హామ్ టెస్ట్‌లో రాణించిన ఆకాశ్‌దీప్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు.

# ఆసియా కప్‌లో భారత్– పాకిస్థాన్ మ్యాచ్ రద్దయ్యే అవకాశం లేదు!



విశ్వంభర, స్పోర్ట్స్:
ఆసియా కప్‌లో భాగంగా సెప్టెంబర్ 14న గ్రూప్ దశలో భారత్ , పాకిస్థాన్‌ల మధ్య మ్యాచ్ జరగనుంది. అయితే ఈ షెడ్యూలు విడుదలైన తర్వాత నుంచి సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం, పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో టీమ్ఇండియా.. ఆ దేశంతో క్రికెట్ మ్యాచ్ ఆడకూడదంటూ పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. అయితే ఈ మ్యాచ్ రద్దయ్యే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఆసియా కప్‌లో మొత్తంగా టీమ్ఇండియా గరిష్ఠంగా మూడుసార్లు పాకిస్థాన్‌తో తలపడే అవకాశం ఉంది. 'ఇది ద్వైపాక్షిక పోటీ కాదు. బహుళ దేశాలు పాల్గొనే టోర్నమెంట్లో జరిగే మ్యాచ్. పాకిస్థాన్‌తో భారత్ మ్యాచ్‌లు ఆడకుంటే.. దాయాది జట్టుకు భారీ ప్రయోజనం కలుగుతుంది. కాబట్టి అది సరికాదు' అని అధికారిక వర్గాలు అంటున్నాయి. అలాగే ఈవిషయమై క్రీడా మంత్రిత్వశాఖ అధికారులు కూడా మాట్లాడారు. 'ప్రస్తుతానికి, జాతీయ క్రీడా పాలన బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు. కాబట్టి.. బీసీసీఐ క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోకి రాదు. అయితే బీసీసీఐ ప్రజల మనోభావాల మీద ఎలా స్పందిస్తుందో వేచి చూద్దాం' అని వారు అన్నారు. అయితే పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలకు మాత్రం తావులేదని క్రీడా మంత్రిత్వ శాఖ పేర్కొంది. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) కేజీఎస్ ధిల్లాన్, పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను పూర్తిగా బహిష్కరించాలని పిలుపునిచ్చిన ప్రముఖులలో ఒకరు. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ ఉగ్రవాదాన్ని ఖండిస్తూ, క్రీడలు కొనసాగాలని పేర్కొన్నారు. అయితే, ఎనిమిది దేశాల జట్లు పాల్గొనే ఆసియా కప్ ఐసీసీఈవెంట్ కాదు. అలాగే.. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మోహ్సిన్ నఖ్వీనే ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు. 2008 ముంబయి ఉగ్రదాడుల వెనక పాకిస్థాన్ హస్తం ఉన్న నేపథ్యంలో.. అప్పటినుంచి భారత్ ఆ దేశంతో ద్వైపాక్షిక సిరీస్‌ల్లో పాల్గొనడం లేదు. కానీ వరల్డ్‌కప్, ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ ఈవెంట్లలో ఇరు దేశాల జట్లు తటస్థ వేదికల మీదే తలపడుతున్నాయి.

# పిచ్ క్యూరేటర్‌తో టీమ్ఇండియా కోచ్ గంభీర్ వాగ్వాదం



విశ్వంభర, స్పోర్ట్స్: టీమ్ ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ , లండన్‌లోని ఓవల్ స్టేడియం పిచ్ క్యూరేటర్ లీ ఫోర్టిస్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ' కేవలం ఇక్కడ నువ్వు ఓ మైదాన సిబ్బంది మాత్రమే. టీమ్ఇండియాకు నువ్వేం చెప్పక్కర్లేదు. ఏం చేయాలో మాకు తెలుసు. కావాలంటే మీ అధికారులకు ఫిర్యాదు చేస్కో' అంటూ గంభీర్ అతడిని తీవ్రంగా హెచ్చరించినట్లు వీడియోలో కనిపిస్తోంది. అయితే, వారిద్దరి మధ్య వాగ్వాదానికి గల కారణం మాత్రం స్పష్టంగా తెలియడం లేదు.టెండూల్కర్ – అండర్సన్ ట్రోఫీలో భాగంగా టీమ్ఇండియా , ఇంగ్లాండ్‌ల మధ్య జులై 31 నుంచి చివరిదైన అయిదో టెస్ట్ మ్యాచ్ జరగనుంది. లండన్‌లోని ఓవల్ స్టేడియం వేదిక కానుంది. ఈ నేపథ్యంలో ట్రెయినింగ్ సెషన్‌లో భాగంగా జట్టు ఆటగాళ్లతో గంభీర్ నెట్స్‌లో సాధన చేయిస్తున్నాడు. ఇంతలో లీ ఫోర్టిస్ అక్కడికి చేరుకొని ఏదో విషయం చెప్పాడు. ఇదే వారిద్దరి మధ్య మాటల యుద్ధానికి కారణమైంది. మాటామాటా పెరగడంతో.. భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కలగజేసుకొని క్యూరేటర్‌ను కాస్త దూరంగా తీసుకొని వెళ్లిపోయాడు. అయినప్పటికీ.. వారిద్దరి మధ్య వాగ్వాదం కాసేపు కొనసాగింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–1తో ఇంగ్లాండ్ ఆధిక్యంలో ఉండగా.. ఒక మ్యాచ్ డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. చివరి టెస్టులో విజయం సాధించి.. సిరీస్‌ను డ్రాగా ముగించాలని భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

# పిన్ అవసరం లేకుండా యూపీఐ లావాదేవీలు




విశ్వంభర, బిజినెస్ బ్యూరో: దేశంలో అత్యంత వేగంగా పెరుగుతున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్(యూపీఐ)లో మరింత సౌకర్యవంతమైన, సురక్షితమైన లావాదేవీలకు అవకాశం కల్పించాలని ఎన్‌పీసీఐ భావిస్తోంది. ముఖ్యంగా ఏదైనా చెల్లింపులు చేసే సమయంలో లావాదేవీ పూర్తి చేయాలంటే పిన్ నంబర్ తప్పనిసరిగా ఎంటర్ చేయాలి. అయితే, దీని స్థానంలో ఫేస్ ఐడీ, బయోమెట్రిక్ పద్ధతిలో లావాదేవీలను పూర్తి చేసేలా మార్పులు తెచ్చేందుకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) ప్రయత్నాలు చేతున్నట్టు సమాచారం. డిజిటల్ లావాదేవీల్లో భద్రతను మెరుగుపరచడం, ఆర్థిక మోసాలను తగ్గించడం, చెల్లింపులను మరింత సురక్షితంగా, యూజర్ ఫ్రెండ్లీగా మార్చే లక్ష్యంతో దీన్ని తీసుకురావాలని ఎన్‌పీసీఐ భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న స్మార్ట్‌ఫోన్‌లలో ఉన్న బయోమెట్రిక్ సామర్థ్యాలను ఉపయోగించుకుని, యూపీఐ లావాదేవీల్లో ఫింగర్ ప్రింట్ ద్వారా చెల్లింపులు చేసేందుకు పలు స్టార్టప్‌లతో ఎన్‌పీసీఐ చర్చలు జరుపుతోందని సమాచారం. ఈ మార్పులు అమల్లోకి వస్తే ఇప్పుడున్న పిన్ స్థానంలో ఆండ్రాయిడ్ ఫోన్‌లలో ఉండే ఫింగర్ ప్రింట్, ఐఫోన్‌లలో ఉండే ఫేస్ ఐడీ ద్వారా లావాదేవీలు నిర్వహించవచ్చు. మాన్యువల్ పిన్ ఎంట్రీనిపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా వేగంగా, ఇబ్బందుల్లేని లావాదేవీలు నిర్వహించవచ్చని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.

# రియల్టీ, ఫార్మా అండతో.. లాభాల్లో ముగిసిన సూచీలు



విశ్వంభర, బిజినెస్: దేశీయ మార్కెట్లు మంగళవారాన్ని లాభాలతో ముగించాయి. వరుసగా మూడురోజులుగా కొనసాగుతోన్న నష్టాలకు నేడు బ్రేక్ పడింది. రియల్టీ, ఫార్మా రంగాలు సూచీలకు అండగా నిలిచాయి. మంగళవారం ఉదయం 80,973.25 వద్ద సెన్సెక్స్ ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,665కు తగ్గి.. చివరకు 446 పాయింట్లు పుంజుకొని 81,328 వద్ద ముగిసింది. నిఫ్టీ 140 పాయింట్ల లాభంతో 24,821 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 15 పైసలు తగ్గి 86.82 గా ముగిసింది. నిఫ్టీ సూచీలో జియో ఫైనాన్షియల్, లార్సెన్, రిలయన్స్, ఆసియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్ రాణించగా.. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టైటాన్ కంపెనీ షేర్లు కుదేలయ్యాయి. ఐటీ, లోహ, రియల్టీ రంగాల్లో కొనుగోళ్లకు మదుపర్లు ఆసక్తి కనబర్చడం ఈ లాభాలకు కారణమైంది. మార్కెట్ అస్థిరతను అంచనా వేసే వీఐఎక్స్ సూచీ 2.9 శాతం క్షీణించింది. యూఎస్ మార్కెట్లు లాభాల్లో ప్రారంభం అవుతాయనే సంకేతాలు మన మార్కెట్లపై ప్రభావం చూపించాయి.నసాగింది.

# సోషల్ మీడియాలో పనిలేనోళ్ళు ఎక్కువయ్యారు



సోషల్ మీడియాలో తరచుగా సెలబ్రిటీలపై ట్రోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ట్రోలింగ్‌లు, ప్రతికూల వ్యాఖ్యలపై నటీనటులు అప్పుడప్పుడు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తునే ఉన్నారు. తాజాగా ఈ విషయంలో టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియాలో వచ్చే అనవసర విమర్శలపై రకుల్ తనదైన శైలిలో ఘాటుగా స్పందించింది. రకుల్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. "సోషల్ మీడియా ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చింది. దురదృష్టవశాత్తూ, మన దేశంలో చాలా మందికి ఎలాంటి పనిలేదు. వారందరికీ ఉచిత డేటా ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల, ఇతరుల జీవితాల గురించి కామెంట్స్ చేయడం తప్ప వారికి ఇంకేమీ పనిలేకుండా పోయింది" అని అన్నారు. కాగా రకుల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. మరోవైపు రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న వేధింపులు, ట్రోలింగ్‌కు అద్దం పడుతున్నాయి. ఉచిత డేటా ప్లాన్‌ల లభ్యత, స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం వల్ల ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాకు సులభంగా చేరువయ్యారని, అయితే దీనిని దుర్వినియోగం చేసే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని ఆమె పరోక్షంగా అభిప్రాయపడ్డారు.





# సడెన్‌గా పెద్ది షూటింగ్‌కి బ్రేక్ ఇచ్చారు..



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ ప్రధాన పాత్రలో, 'ఉప్పెన' ఫేమ్ సానా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'పెద్ది'. 'గేమ్ ఛేంజర్' చిత్రంతో నిరాశ చెందిన అభిమానులు ఇప్పుడు ఈ కొత్త సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. 'రంగస్థలం' తరహాలో మాస్, రా లుక్‌లో చెర్రీ కనిపించడంతో పాటు ఫస్ట్ లుక్, గ్లింప్స్‌తో సినిమాపై క్రేజ్ విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా రామ్‌చరణ్ కొట్టిన క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ రామ్‌చరణ్‌కు జోడిగా నటిస్తోంది. ఇది రామ్ చరణ్‌తో చేస్తున్న తొలి తెలుగు సినిమా కావడంతో , ఈ కాంబోపై మంచి హైప్ ఏర్పడింది. తెరవెనుక బుచ్చిబాబు జెట్ స్పీడ్‌తో పని చేస్తున్నారు. ఇప్పటి వరకు సినిమాకు సంబంధించి 50 శాతం పైగా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం హైదరాబాద్ శివారులో వేసిన భారీ సెట్‌లో యాక్షన్ సీన్ చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో చరణ్, జాన్వీ ఇద్దరూ పాల్గొంటున్నారు. షూటింగ్ బ్రేక్ సమయంలో, బుచ్చిబాబు–జాన్వీ కలిసి హైదరాబాద్‌లోని ఏఎంబీ మాల్‌లో 'హరిహర వీరమల్లు' సినిమా వీక్షించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే అనూహ్యంగా తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. యాక్షన్ ఎపిసోడ్ పూర్తిగా ఔట్‌డోర్‌లో చేస్తుండడంతో వాతావరణం సహకరించకపోవడం వలన బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. వర్షాలు తగ్గిన వెంటనే మళ్లీ షూటింగ్‌ను పునఃప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ సినిమా ఉత్తరాంధ్ర విలేజ్ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోంది. ఇందులో వచ్చే ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్, భారతీయ సినిమాలో ఇప్పటివరకు చూడనంత విజువల్ ట్రీట్‌గా ఉంటుందని తెలుస్తోంది. 'రంగస్థలం' కంటే ఇది చాలా గొప్పగా ఉంటుందని రామ్‌చరణ్ స్వయంగా చెప్పడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. తర్వాత సుకుమార్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నాడు. ఈ కాంబోలో వచ్చిన 'రంగస్థలం' ఎంత పెద్ద హిట్ అయ్యిందో అందరికీ తెలిసిందే. ఇకపోతే, చరణ్ ప్రస్తుతం మరో రెండు మూడు ప్రాజెక్టుల కోసం కథలు వింటున్నట్లు సమాచారం. మొత్తానికి 'పెద్ది' సినిమాపై భారీ అంచనాలు అయితే ఉన్నాయి.

# హరిహర వీరమల్లు చిత్రాన్ని దెబ్బ కొట్టిన 'మహావతార్ నరసింహ'






జులై 24న థియేటర్లలో విడుదలైన పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు చిత్రం, కథ పరంగా ఆసక్తికరంగానే ఉన్నప్పటికీ, స్క్రీన్ ప్లే, వీఎఫ్ఎక్స్ లోపాలతో ప్రేక్షకులను నిరాశపరిచింది. ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ విషయంలో వచ్చిన భారీ విమర్శలతో, సినిమా మీద నెగెటివ్ టాక్ వచ్చేసింది. అయితే ఫ్యాన్స్ వలన ఫస్ట్ మూడు రోజులు బాగానే కలెక్షన్లు వచ్చాయి. సమాచారం ప్రకారం ఇప్పటివరకు ఈ సినిమా దాదాపు ?85 కోట్లు గ్రాస్ వసూలు చేసినట్టు చెబుతున్నారు. అయితే హరిహర వీరమల్లు విడుదలైన మరుసటి రోజే, జులై 25న చిన్న సినిమా, అదీ యానిమేషన్ సినిమా అయిన మహావతార్ నరసింహ విడుదలైంది. మొదట ఈ సినిమా గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. %ప్రమోషన్ కూడా తక్కువగా జరిగింది. అయినప్పటికీ, ఈ భక్త ప్రహ్లాద కథ ఆధారంగా హొంబలే ఫిలిమ్స్ నిర్మించిన యానిమేషన్ చిత్రం, విడుదలైన వెంటనే మౌత్ టాక్ ద్వారా సెన్సేషన్ సృష్టించింది. హిరణ్యకశ్యపుడి దారుణ పాలన, భక్త ప్రహ్లాద భక్తి, చివరగా నరసింహ స్వామి అవతారం.. ఈ అన్ని సంగతులను అద్భుతంగా యానిమేషన్ ద్వారా చూపించారు. ముఖ్యంగా చివరి 20 నిమిషాల్లో నరసింహ స్వామి అవతరించే సీన్లు థియేటర్లలో ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెచ్చాయి. పిల్లలతో పాటు పెద్దల్ని కూడా ఆకట్టుకున్న ఈ సినిమా, చిన్న స్థాయిలో ప్రారంభమైనప్పటికీ, మౌత్ టాక్ బాగా ఉ ఒడడంతో థియేటర్ల సంఖ్య వేగంగా పెరిగింది. ప్రస్తుతం కొన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లలో హరిహర వీరమల్లు సినిమాని తీసేసి, అదే స్క్రీన్లో మహావతార్ నరసింహని వేస్తున్నారు. ప్రతి షోకి హౌస్‌ఫుల్ బుకింగ్స్ వస్తుండటం విశేషం. కథ, యానిమేషన్, భక్తి భావన..ఇలా అన్ని అంశాలు కలిసి ఈ సినిమాకు బలమైన బజ్‌ను తీసుకొచ్చాయి. కేవలం ?5 కోట్ల బడ్జెట్ తో తీసిన ఈ యానిమేషన్ మూవీ, ఇప్పటికే ?12 కోట్లు గ్రాస్ వసూలు చేసినట్టు సమాచారం. తెలుగుతో పాటు పాన్ ఇండియా లెవెల్లో ఈ సినిమాకు మెల్లగా డిమాండ్ పెరుగుతోంది. కథ బాగుంటే, ప్రెజెంటేషన్ నచ్చితే, ప్రేక్షకులు ఆ సినిమా చిన్నదా, పెద్దదా అనేది చూడకుండా భారీ హిట్ చేస్తారు అని మరోసారి నిరూపించారు.

# అనసూయ ఏకంగా 30 లక్షల మందిని బ్లాక్ చేసిందా..



అనసూయ భరద్వాజ్.. ఈ పేరు గురించి రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారుండరు. అటు బుల్లితెరపై, ఇటు వెండితెరపై సంచలనాలు క్రియేట్ చేస్తున్న ఈ ముద్దుగుమ్మ ఒక్కోసారి ఆసక్తికర కామెంట్స్ కూడా చేస్తూ వార్తలలో నిలుస్తూ ఉంటుంది. బుల్లితెరకు గ్లామర్ అద్దిన అతికొద్ది మందిలో అనసూయ ఒకరు కాగా, ఈ బ్యూటీ జబర్దస్త్ షోతో భారీ పాపులారిటీ సంపాదించింది. మాటలతో మజా చేస్తూనే అందంతో మాయ చేసి కుర్రకారుకి కంటిపై కునుకు లేకుండా చేసింది. నటిగా కూడా తనదైన ముద్ర వేసుకున్న అనసూయ భరద్వాజ్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచింది. 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప', 'పుష్ప 2' వంటి చిత్రాల్లో నటిగా మెప్పించిన అనసూయ స్పెషల్ సాంగ్స్, ఈవెంట్ పెర్ఫార్మెన్స్‌ల ద్వారా కూడా అభిమానులను అలరిస్తూ ఉంటుంది.. ఇటీవల టీవీ షోలతో మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చిన ఆమె, 'కిర్రాక్ బాయ్స్ ఖిలాడీ గర్ల్స్' వంటి షోలలో టీమ్ లీడర్‌గా కనిపించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అనసూయ మాట్లాడుతూ, తనపై వచ్చే ట్రోల్స్, నెగెటివ్ కామెంట్స్‌పై స్పందించింది. ఎవరైనా అభ్యంతరకరంగా కామెంట్ చేస్తే వెంటనే బ్లాక్ చేస్తాను. ఇప్పటివరకు సుమారుగా 30 లక్షల మందిని బ్లాక్ చేసి ఉంటాను. నేను వాళ్లను ఇక భరించలేను అనుకున్నప్పుడు నా ప్రపంచం నుంచి తొలగించేస్తాను అని చెప్పుకొచ్చింది అనసూయ. అనసూయ చేసిన ఈ కామెంట్స్‌పై కూడా నెటిజన్లు సెటైర్స్ వేస్తున్నారు. అనసూయ చాలా మందిని బ్లాక్ చేశాను అని ఉంటే సరిపోయేది కానీ 30 లక్షల మందిని బ్లాక్ చేశానని చెప్పడం నమ్మశక్యంగా లేదని అంటున్నారు. రోజుకి పది నుండి వంద మందిని బ్లాక్ చేసిన కూడా మూడు మిలియన్ కాదంటూ సెటైర్స్ వేస్తున్నారు. అనసూయకి ఇన్‌స్టాలో ఉన్న ఫాలోవర్స్ 20 లక్షలు మాత్రమే, మరి ఆమె 30 లక్షల మందిని ఎలా బ్లాక్ చేసిందంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఈ ట్రోల్స్‌పై అనసూయని ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి స్పందిస్తూ.. ఇతరులపై కామెంట్ చేయడం ఎంత ఈజీగా ఉంటుందో%ా% ఒక్కసారి ఆమె కోణం నుంచి కూడా ఆలోచించండి. ఆమె నిజంగానే చాలా నెగెటివ్ కామెంట్లను ఎదుర్కొంటోంది. 30 లక్షలు అనేది తుది గణాంకం కాకపోయినా, ఆమె చాలా మందిని బ్లాక్ చేసిందనేది నిజం. ఆమెకు ఆ సంఖ్య గుర్తుండకపోవచ్చు . కనీసం మనం ఒక వ్యక్తిగా గౌరవం చూపిస్తే బాగుంటుంది, ఇలా ట్రోల్ చేయాల్సిన అవసరం లేదని భావిస్తున్నాను అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com